జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 29, నవంబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## అది నిరూపిస్తే బహిరంగ క్షమాపణ చెబుతా

- ఆరోగ్య రంగంలో 52 వేల మందిని నియమించామని జగన్ చెప్పడం పచ్చి అబద్ధం
- ఓటు వేయని ప్రజల్ని జగన్ నిందించడం ఇప్పటికైనా మానుకోవాలి
- అధికారం లేదన్న నిరాశ, ఆక్రోశం జగన్‌లో స్పష్టంగా కనిపిస్తోంది
- ఎక్స్‌లో జగన్ విధ్వంస వైఖరిపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ట్వీట్




**అమరావతి,మహానాడు:** అధికారం లేదన్న నిరాశ జగన్‌లో స్పష్టంగా కనిపిస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు. అధికారంలో లేని ఈ 5 నెలల్లో దాదాపు డజను సార్లు మీడియాతో మాట్లాడిన జగన్, ప్రతిసారీ ప్రజలను తిడుతూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో అద్భుతాలు చేస్తే ప్రజలు ఎందుకు ఓడిస్తారని ప్రశ్నించారు. ఓడిపోయిన వ్యక్తి ప్రజలిచ్చిన ప్రజాస్వామ్య తీర్పును నిందించడమేంటని ప్రశ్నించారు.

తన హయాంలో సంపద సృష్టించానని జగన్ చెబుతున్నారని, కాకపోతే ప్రజల సొమ్ముతో ఆయన సొంత సంపద పెంచుకున్నారన్నారు. విద్యుత్ రంగాన్ని ధ్వంసం చేసిన విధానమే జగన్ సంపద సృష్టికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ఆరోగ్య రంగానికి సంబంధించి కూడా జగన్ పచ్చి అబద్ధాలు చెప్పారంటూ మంత్రి మండిపడ్డారు. ఐదేళ్లలో 52 వేల మందిని రిక్రూట్ చేశామని చెబుతున్న

మిగతా.. 2లో

కొండెక్కిన

# గ'లీజు'



- తిరుమలపై ఇంకా వైసీపీ నేతలదే హవా
- పెద్దిరెడ్డి, చెవిరెడ్డి, భూమన అనుచరుల చేతిలోనే హోటళ్లు
- వారి అనుచరుల చేతిలోనే సబ్‌లీజుల యవ్వారం
- అనధికార బుట్టల వ్యాపారాలకు లెక్కే లేదు
- రోజా హవాతో హోటళ్లు దక్కించుకున్న బెంగళూరు కాంట్రాక్టరు
- పేరు టూరిజం.. పెత్తనమంతా ప్రైవేటు వ్యక్తులదే
- లీజు ఒకరిది.. సబ్ లీజు మరొకరికి
- సబ్ లీజు నిబంధనలు బేఖాతరు
- మీడియా ప్రతినిధులకూ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, షాపులు
- ఇద్దరు జేఈఓల జమానాలో మీడియా ప్రతినిధులకు షాపులు
- అందుకే మీడియాలో కొండపై వెలుగుచూడని అవినీతి
- వాటిని రద్దు చేసే ధైర్యం కొత్త బోర్డుకు ఉందా?
- 'కొండె'క్కిన నిబంధనలు
- కొత్త కమిటీ నిబద్ధతకు పరీక్ష

మహానాడు ఫోకస్

(మార్తి సుబ్రహ్మణ్యం)

**వెంకన్న నామస్మరణతో పులకించాల్సిన తిరుమల కొండ.. ప్రైవేటు నామ స్మరణతో ప్రతిధ్వనిస్తోంది. కొండపై అన్యులకు స్థానం ఉండకూడదన్న నిబంధన కొండెక్కింది. కాదు.. కొండెక్కించేశారంతే! లీజు-సబ్ లీజుల వ్యాపారం మూడు హోటళ్లు- ఆరు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లుగా వర్ధిల్లుతోంది. లీజులు తీసుకున్న వ్యాపారులు-స్థానిక జర్నలిస్టులు, వాటిని ఇతరులకు సబ్‌లీజులకు ఇస్తున్నా కొండపై కొలువుదీరిన పాలకులది ఇప్పటికీ 'ధృతరాష్ట్ర' దర్శనమే. వీటికి మించి... కూటమి సర్కారు కొలువుదీరి ఇన్ని నెలలయినా, ఇంకా కొండపై వైసీపీ హవానే నడుస్తోంది. వారిని కదిలించే సాహసం కొత్త కమిటీ చేస్తుందా? సబ్ లీజుల యవ్వారానికి పాతర వేస్తుందా? అక్రమాలకు పాతర వేసి తన నిబద్ధత చాటుకుంటుందా? లేక ఇదంతా 'మామూలే' అనుకుని, టీటీడీ దర్శనాల సిఫార్సు లేఖలతోనే సరిపెట్టుకుంటుందా? ఇదీ ఇప్పుడు కూటమి వర్గాల్లో హాట్ టాపిక్.**

కూటమి అధికారంలోకి వచ్చి ఆరునెలలవుతోంది. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలనూ మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ తిరుమల కొండపై మాత్రం.. 'కూటమి ఇంకా అధికారంలోకి వచ్చిన దాఖలాలు' ఏమీ కనిపించడం లేదు. ఇంకా వైసీపీ హవానే నడుస్తోంది. ఎందుకంటే అప్పటి అధికారులే... వైసీపీ నేతల హోటళ్లే కొనసాగుతున్నాయి కాబట్టి! కాకపోతే కొత్తగా భూమన కరుణాకర్‌రెడ్డి పోయి బీఆర్ నాయుడు వచ్చారు. అంటే రెడ్డి గారు వెళ్లి నాయుడుగారొచ్చారు. ఇంకా చెప్పాలంటే.. రెడ్డిపోయి నాయుడొచ్చె ఢాం..ఢాం..ఢాం అన్నమాట. మిగిలినదంతా సేమ్‌టు సేమ్.

వైసీపీ హయాంలో చిత్తూరు జిల్లాలో ఒక వెలుగు వెలిగిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, రోజా అనుచరులు తిరుమల కొండను తమ అనుచరులతో నింపేశారన్న ఆరోపణలు ఉండేవి. ముఖ్యంగా చెవిరెడ్డి అనుచరులు కొండపై హోటళ్లు యధేచ్ఛగా లీజుకు తీసుకుని, వాటని సబ్‌లీజుకు ఇచ్చేశారన్న ఆరోపణలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అవి వారి పెత్తనం కిందే నడుస్తుండటం విశేషం.

అప్పట్లో కొండపై చెవిరెడ్డి అనుచరులకే హోటళ్లు ఎక్కువగా ఉండేవి. వాటిని లీజుకు తీసుకున్న చెవిరెడ్డి అనుచరులు, ఎక్కువ ధరకు సబ్‌లీజుకు ఇచ్చేవారన్న ఆరోపణలు, అప్పుడే వచ్చినా పట్టించుకున్న దిక్కులేదు. నిజానికి అది నిబంధనలకు విరుద్ధం. సబ్‌లీజు పద్ధతి టీటీడీలో లేదు. ఇక ఇద్దరు జేఈఓల జమానాలో కొండపై ప్రముఖ చానెళ్లు, పత్రికల్లో పనిచేసే విలేకరులకు ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లు, చిన్న హోటళ్లు లీజుకు ఇచ్చారు. ఇందులో ఒకరు టీడీపీలో ఉన్నప్పుడు వెలిగిపోయిన జేఈఓ కాగా, మరొకరు మొన్నటి వరకూ హవా సాగించిన జేఈఓ కావడం గమనార్హం.

ఇక పెద్ద మీడియా సంస్థలు, చానెళ్ల ప్రతినిధులకు దర్శనం కోటాలు కూడా ఇవ్వడం మరో విశేషం. ఆ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను లీజులకు తీసుకున్న స్థానిక విలేకరులు.. వాటిని రోజుకు 25 వేల రూపాయల చొప్పున, సబ్‌లీజుకు ఇస్తున్న వ్యవహారం విజయవంతంగా కొనసాగుతోంది. అందుకే ఆ ఇద్దరు జేఈఓలు ఉన్నప్పుడు, కొండపై జరిగే అవినీతి బయటకు పొక్కేది కాదు. అవి మీడియాలో రాకుండా ఉండేందుకే.. ఆ ఇద్దరు జేఈఓలు, ఈవిధంగా క్విడ్‌ప్రోకో సిద్ధాంతం పాటించారన్న ఆరోపణలుండేవి. ఇక హోటళ్లను రోజూ లక్ష నుంచి 5 లక్షల అద్దెపేరిట సబ్‌లీజుకు ఇస్తున్న పద్ధతి ఇంకా కొనసాగుతోంది. వీరంతా చెవిరెడ్డి అనుచరులేనన్నది ఒక ఆరోపణ. ఇక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి జమానాలో కొండపై నుంచి కిందవరకూ.. ఫుట్‌పాత్, బుట్టలపై వ్యాపారాలు విచ్చలవిడిగా సాగేది. వాటికి లైసెన్సులు ఉండాలి. కానీ అవేమీ లేకుండా వారికి అనధికార లైసెన్సులు ఇచ్చేశారు. వైసీపీ కార్యకర్తలు వాటిని తీసుకుని, వ్యాపారులకు రోజువారీ చెల్లింపుల కింద ఇస్తున్నారన్న ఆరోపణలు లేక పోలేదు. భూమన అనుచరులకూ, కొండపై హోటళ్లు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మిగతా.. 8లో

## ఈనాడు, ఆంధ్రజ్యోతిపై పరువునష్టం దావా

- 8 గంటల సమయం ఇచ్చి, క్షమాపణ చెప్పాలని కోరుతా
- వారు ఆ పని చేయకపోతే, రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేస్తా
- అమెరికాలో నమోదైన డాక్యుమెంట్‌లో ఎక్కడా నా పేరు లేదు
- సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కమ్‌ల మధ్య ఒప్పందం. మధ్యలో దళారి లేడు
- అది సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కమ్‌ల మధ్య జరిగిన ఒప్పందం
- దానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి కూడా ముందే ఇచ్చింది
- యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘన
- వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ సీఎం, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి



**తాడేపల్లి,మహానాడు:** అమెరికాలో నమోదైన డాక్యుమెంట్‌లో ఎక్కడా నా పేరు లేదు. కావాలంటే చూడండి. ఇక్కడ పత్రికల్లో నా పేరు రాసిన వాళ్లనే అడగండి. సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కమ్‌ల మధ్య ఒప్పందం. మధ్యలో దళారి లేడు. అలాంటప్పుడు అవినీతికి అవకాశం ఎక్కడ? వాణిజ్యవేత్తలు పాలకులను కలవడం కొత్త కాదు. అన్ని చోట్లా జరుగుతుంది. నన్ను అదానీ కలవడం కొత్త కాదు. ఆయన నన్ను చాలాసార్లు కలిశారు. సెకీతో ఒప్పందానికి ముందు, తర్వాత కూడా కలిశారు. ఆయన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టారు. అందుకే కలిశారు. ఆ భేటీకి వేరే ప్రత్యేకత లేదు. నిజానికి సెకీ మాకే కాకుండా, వేరే రాష్ట్రాలకు కూడా రాసి ఉండొచ్చు. వారు స్పందించకపోయి ఉండొచ్చు. కానీ, మేము స్పందించాం.

రాష్ట్రంలో వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎలా విప్లవాత్మక అడుగులు పడ్డాయి. ఇప్పుడు అవిఎలా వెనక్కు వెళ్తున్నాయో చెబుతాను. రాష్ట్రంలో ఈరోజు చాలా బాధాకరమైన పరిస్థితులు. ఒక బడ్జెట్ ప్రవేశపెట్టడం. దాని ద్వారా కాన్ఫిడెన్స్ ఇవ్వడం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు.. ఇవేవీ కనిపించడం లేదు. సూపర్‌సిక్స్, సూపర్‌సెవెన్ లేదు. యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘన. రెడ్‌బుక్ పాలన కొనసాగుతోంది. ప్రతి చోటా దోపిడి. ఒక మాఫియా సామ్రాజ్యం. పైస్థాయి నుంచి కింది వరకు ఎక్కడికక్కడ కమిషన్లు. దోపిడి.

గతంలో అసాధ్యం అనుకున్న మార్పులు మనం చేసి చూపగలిగాం. మేం తీసుకొచ్చిన ప్రతి మార్పు, నా సుదీర్ఘ 3648 కి.మీ పాదయాత్రలో ప్రజల కష్టాలు

మిగతా.. 2లో



## బీజేపీకి ఒక ఎంపీ సీటు?

- రాజ్యసభలో బలం పెంచుకునే వ్యూహం
- టీడీపీకి 2, బీజేపీకి ఒకటి
- బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య?
- పరిశీలనలో కిరణ్‌కుమార్‌రెడ్డి?
- కృష్ణయ్య వైపే మొగ్గు?
- కిరణ్‌కు సీటిస్తే కృష్ణయ్యకు జాతీయ బీసీ కమిషన్ పదవి?
- బీద మస్తాన్ సభ్యత్వం కొనసాగింపు
- నాగబాబుకు ఎంపీ సీటు లేనట్టేనా?
- ప్రధానితో భేటీ అందుకేనా?

(మార్తి సుబ్రహ్మణ్యం)

రాజ్యసభ ఎన్నికల్లో ఏపీ నుంచి మూడు స్థానాలకు జరిగే ఉప ఎన్నికల్లో ఎవరికి ఎన్ని స్థానాలనే అంశంపై కూటమిలో స్పష్టత వచ్చింది. వైసీపీ ఎంపీలు ఆర్.కృష్ణయ్య, మోపిదేవి వెంకట రమణ, బీద మస్తాన్‌రావు రాజీనామాలతో ఉప ఎన్నికలు వచ్చిన విషయం తెలిసిందే.అయితే వీరిలో బీద మస్తాన్‌రావు టీడీపీ ఎంపీగా మళ్లీ బరిలోకి దిగనున్నారు.

కాగా ఈ ఎన్నికల్లో ఒక సీటు పొత్తులో భాగంగా బీజేపీకి ఇవ్వాలని టీడీపీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాజ్యసభలో బీజేపీ బలం పెంచుకునే క్రమంలో భాగంగా, ఏపీ నుంచి జరిగే ఉప ఎన్నికల్లో ఒక సీటు తమకు కావాలని కేంద్రహోంమంత్రి అమిత్‌షా సీఎం చంద్రబాబును అభ్యర్థించగా, ఆ మేరకు బాబు అంగీకరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

దానితో బీజేపీ అభ్యర్థి ఎవరు అవుతారన్న చర్చకు తెరలేచింది. రాజీనామా చేసిన బీసీ జాతీయ నేత ఆర్.కృష్ణయ్య బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన రాజీనామా చేసే సందర్భంలో మళ్లీ ఆ సీటు తనకే ఇవ్వాలన్న షరతు విధించినట్లు ప్రచారం జరుగుతోంది. బీసీ వర్గాల్లో ఇమేజ్ ఉన్న కృష్ణయ్యతో తమకు రాజకీయంగా లాభమన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది.

అయితే మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు కూడా తెరపైకొస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోయిన కిరణ్‌కు రాజ్యసభ సీటు ఇవ్వడం ద్వారా.. రెడ్డి సామాజికవర్గాన్ని ఆకర్షించడంతోపాటు, రాయలసీమలో పార్టీని పటిష్ఠం చేయవచ్చన్న వ్యూహం కూడా లేకపోలేదు. ఒకవేళ కిరణ్‌కుమార్‌రెడ్డికి రాజ్యసభ సీటు ఇస్తే.. ఆర్ .కృష్ణయ్యకు జాతీయ బీసీ కమిషన్ పదవి ఇవ్వడం ఖాయమన్న ప్రచారం జరుగుతోంది.

ఇదిలాఉండగా.. మూడు స్థానాల్లో ఒకటి, డిప్యూటీ సీఎం పవన్ సోదరుడు నాగబాబుకు ఇవ్వవచ్చన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఒక సీటు బీజేపీకి కేటాయించిన నేపథ్యంలో, ఉన్న ఒకేఒక సీటును జనసేనకు ఇవ్వడం అసాధ్యమని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఒక సీటు బీద మస్తాన్‌రావుకు ఖరారయిన నేపథ్యంలో, మరొక స్థానాన్ని పార్టీకి కష్టకాలంలో పనిచేసిన వారికి కేటాయించాల్సి ఉంది. ఇప్పటికే రాజ్యసభ సీటుపై పార్టీలో విపరీతమైన ఒత్తిడి ఉంది.

కాగా తాజా పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో, ఆయన ప్రధాని మోదీని కలిసినప్పుడు.. ఒక సీటు తమకు ఇవ్వాలని ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్‌ను కోరినప్పుడు, ఆయన కూడా అందుకు

మిగతా.. 2లో

## దేశ చరిత్రలో ఆఫ్ షోర్ మైనింగ్‌లో ఓ కొత్త అధ్యాయం

- ఇవాళ్టి నుంచి భారతదేశం కూడా ఈ జాబితాలో చేరనుంది
- క్రిటికల్ మినరల్ మిషన్ ప్రకటించిన 5 నెలల్లోనే ముందడుగు
- దేశ చరిత్రలో తొలిసారిగా.. ఆఫ్‌షోర్ మినరల్స్ బ్లాక్స్ వేలం కార్యక్రమం సందర్భంగా.. ఢిల్లీలోని అశోకా హోటల్ లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి




**ఢిల్లీ,మహానాడు:** ఈ చారిత్రక ఘట్టంలోకి మీ అందరికీ స్వాగతం. దేశంలో మొట్టమొదటిసారి ఆఫ్ షోర్ ఏరియా మినరల్ బ్లాక్స్ వేలంలోకి మీ అందరికీ స్వాగతం. దేశ చరిత్రలో ఆఫ్ షోర్ మైనింగ్‌లో ఓ కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. ప్రధానమంత్రి మోదీ దార్శనికతకు అనుగుణంగా ముందుకెళ్తున్నాం.. బ్లూ ఎకానమీ ద్వారా గ్రీనర్ ప్లానెట్ సాధ్యమని మోదీ తరచూ చెబుతున్నారు. ఆఫ్ షోర్ మినరల్ డెవలప్ మెంట్ యాక్ట్ 2002 ను..2010వ సంవత్సరంలో వినియోగంలోకి తీసుకొచ్చారు. కానీ ఆ తర్వాత 13 ఏళ్లపాటు లిటిగేషన్లు, ఇతర సమస్యల కారణంగా వేలం జరగలేదు. భారతదేశంలో 21 లక్షల ఎకరాల ఆఫ్ షోర్ మినరల్ కెపాసిటీ ని ఎక్స్ ప్లోర్ చేశాం. దీని ద్వారా వికసిత్ భారత దిశగా భారతదేశపు మైనింగ్ రంగం మరింత పురోగతి సాధించనుంది. ప్రపంచంలో చాలా తక్కువ దేశాలు.. ఆఫ్ షోర్ మైనింగ్ లో పనిచేస్తున్నాయి. ఇవాళ్టి నుంచి భారతదేశం కూడా ఈ జాబితాలో చేరనుంది. ఇవాళ..రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్విప్ మెంట్స్, ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్ పెరిగింది. భవిష్యత్తులో మరింత పెరగనుంది.

మిగతా.. 2లో

## విద్యార్థులను కన్నబిడ్డల్లా చూడాలి

- పాఠశాలలు, గురుకులాలను తరచూ తనిఖీ చేయాలి
- విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అందజేయాలి
- జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
- వసతిగృహాల్లో తరచూ ఘటనలో చోటుచేసుకోవడంపై సీఎం ఆగ్రహం
- బాధ్యులైన వారిపై వేటు వేయాలని ఆదేశాలు



**హైదరాబాద్,మహానాడు:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాల్లలో విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారానికి సంబంధించి చోటుచేసుకుంటున్న ఘటనలపై ముఖ్యమంత్రి పలుమార్లు సమీక్షించారు. కలెక్టర్లు తరచూ పాఠశాలల, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని.. అనంతరం అందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాశీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు.

విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు వెనుకాడమని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

మిగతా.. 2లో



03 వైసీపీ నేత విజయ్‌బాబుపై హైకోర్టు సీరియస్



03 రైతు మోసాల ఉత్సవాలు జరుపుకోండి



03 కూటమి ప్రతిష్ఠపై జెసి-ఆది 'బూడిద'

## ఖేలో ఇండియా గేమ్స్‌కు వేదికగా హైదరాబాద్

- 2026లో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖం

**హైదరాబాద్,మహానాడు:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఖేలో ఇండియా - 2026 పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా సానుకూలంగా




స్పందించింది. వచ్చే ఏడాది నిర్వహించేలా ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేసినా, 2025లో బిహార్‌లో నిర్వహించేలా ఇప్పటికే నిర్ణయం జరగడంతో 2026లో హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ సింగ్ మాండవీయ సానుకూలంగా స్పందించి సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డికి హామీ ఇచ్చారు. రాతపూర్వక విజ్ఞప్తిని జితేందర్‌రెడ్డి గురువారం (నవంబరు 28) కేంద్ర మంత్రికి అందజేసి వివరించగా పై స్పష్టత లభించింది.

హైదరాబాద్ నగరంలో 32వ జాతీయ క్రీడలు (2002లో), ఆఫ్రో ఆషియన్ గేమ్స్,

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 29, నవంబర్ 2024 ||

## విద్యార్థులను కన్నబిడ్డల్లా చూడాలి

మొదటి పేజీ తరువాయి..

విద్యార్థుల విషయంలో తాము సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వసతిగృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించడంతో పాటు లేని వార్తలను ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని.... వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.



యావత్ దేశానికి మార్గాన్ని నిర్దేశిస్తూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరాలు నమోదు చేయించుకున్నారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ , జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి , ఇతర అధికారులు, ఎన్యుమరేటర్లు, సిబ్బందితో కూడిన సర్వే బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు.

## అది నిరూపిస్తే బహిరంగ క్షమాపణ చెబుతా

మొదటి పేజీ తరువాయి..

జగన్, ఆ వివరాలను బహిరంగపరచాలని సవాల్ విసిరారు. ఆరోగ్య రంగంలో 52 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చింది నిజమేనని నిరూపించ గలిగితే తాను బహిరంగా క్షమాపణలు చెబుతానన్నారు. 'జీరో వేకెన్సీ విధానం'పైనా జగన్ కల్లబొల్లి కబుర్లు చెప్పారన్న మంత్రి, రాష్ట్రంలోని 17 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2 వేల మంది అధ్యాపకుల కొరత ఉందని స్పష్టం చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్యుల కొరత 4 శాతం మాత్రమేనంటూ జగన్ మరో పచ్చి అబద్ధం చెప్పారని, ఇది జగన్ హయాం నుంచి చెక్కుచెదరకుండా 59 శాతంగా ఉందన్నారు. ఆరోగ్య రంగంపై తాను సమీక్ష చేస్తే ఈ విషయాలు బయట పడ్డాయని సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

ఇలా అబద్ధాలు చెప్పడం, ప్రజలను నిందించడం మానుకోవాలని జగన్ కు సత్యకుమార్ యాదవ్ హితవు పలికారు. తన అసహనాన్ని, నిరాశను, భ్రమలను ప్రజలపై రుద్దకుండా, వాటిని అధిగమించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ మేరకు సత్యకుమార్ యాదవ్ ట్వీట్ చేశారు.

## దేశ చరిత్రలో ఆఫ్ షోర్ మైనింగ్‌లో ఓ కొత్త అధ్యాయం

మొదటి పేజీ తరువాయి..

తదనుగుణంగా.. ఇందులో వినియోగించే.. లిథియం, కోబాల్ట్, నికెల్.. తదితర క్రిటికల్ మినరల్స్ డిమాండ్ పెరగనుంది.

అంతర్జాతీయ ఏజెన్సీల అంచనాల ప్రకారం.. 2030 నాటికి ఆఫ్ షోర్ మినరల్స్ మార్కెట్ దాదాపు లక్షకోట్లకు చేరనుంది. మనం వివిధ క్రిటికల్ మినరల్స్ ను పెద్దమొత్తంలో దిగుమతి చేసుకుంటున్నాం. ఇది భారతదేశానికి ఓ సవాల్, ఓ అద్భుతమైన అవకాశం కూడా. క్రిటికల్ మినరల్ రంగంలో మనం ఆశాకిరణంగా ముందడుగేసేందుకు విస్తృతమైన అవకాశాలున్నాయి. భారతదేశంలో చాలా త్వరగా.. క్రిటికల్ మినరల్ మిషన్ ప్రారంభించుకోనున్నాం. ప్రభుత్వ పీఎస్ యూ కాబిల్ ద్వారా విదేశాల్లోని క్రిటికల్ మినరల్స్ ఎక్స్ ప్లొరేషన్ యాక్టివిటీని ప్రారంభించాం. అర్జెంటీనాలో 5 లిథియం బ్లాక్స్ తీసుకుని ఎక్స్ ప్లొరేషన్ చేస్తున్నాం. వివిధ ఇతర దేశాలతోనూ చర్చిస్తున్నాం.

ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల ప్రకారం.. ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్.. క్రిటికల్ మినరల్ మిషన్ ను ప్రకటించారు. ప్రకటించిన.. 5 నెలల్లోనే.. ఈ దిశగా మేం కీలకమైన ముందడుగేశాం. రానున్న రోజుల్లో ఈ దిశగా మరిన్ని ట్రాంచెస్ లో వేలం వేయనున్నాం. ప్రభుత్వ పీఎస్ యూలతోపాటు.. ప్రైవేట్ సంస్థలను భాగస్వాములను చేసి ఈ రంగాన్ని మరింత ఉత్తమ ఫలితాలకోసం ముందుకు తీసుకెళ్తున్నాం.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం సంస్కరణలు తీసుకొచ్చాం. పారదర్శకంగా మినరల్ బ్లాక్స్ వేలం కారణంగా.. రాష్ట్రాల రెవెన్యూ కూడా గణనీయంగా పెరిగింది. 2004–2015 వరకు రాష్ట్రాల రెవెన్యూ.. 60 వేల కోట్లుంటే.. 2025–2024 వరకు ఇది 2.54 లక్షల కోట్లకు పెరిగింది. అంటే దాదాపు నాలుగు రెట్లు రెవెన్యూ రాష్ట్రాలకు పెరిగింది. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. ముందు ముందు..మరింత పురోగతి సాధిస్తాం.. మన దగ్గర మైనింగ్ రంగంలో వివిధ భేదాలను సంబంధించిన.. విస్తృతమైన అనుభవం ఉంది. జీఎస్ఐ అనుభవ.. ప్రైవేట్ రంగం సృజనాత్మకతను సమ్మిళితం చేసి ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.. మీ అందరి సహకారంతో.. బ్లూ ఎకానమీ రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ.. ఆత్మనిర్భర భారత నిర్మాణంలో, వికసిత భారత నిర్మాణంలో ముందుకెళ్దాం.

## ఖేలో ఇండియా గేమ్స్‌కు వేదికగా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి..

7వ మిలిటరీ గేమ్స్ సహా అనేక జాతీయ స్థాయి పోటీలు జరిగాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ లేఖలో ప్రస్తావించారు. క్రీడా రంగానికి గత పదేండ్ల పాలనతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువ ప్రాధా న్యత ఇస్తున్నదని, జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడానికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని ఆ లేఖలో సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు.

గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్సుల అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, హాకీ టర్ఫ్, షూటింగ్ రేంజ్, సరూర్‌నగర్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం (ఎయిర్ కండిషన్డ్), సింథటిక్ టెన్నిస్ కోర్ట్, స్కేటింగ్ ట్రాక్, ఔట్ డోర్ స్టేడియం, ఎల్బీ స్టేడియంలో ఇండోర్ స్టేడియంతో పాటు టెన్నిస్ కాంప్లెక్స్, ఫుట్ బాల్ గ్రౌండ్, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, హుస్సేన్ సాగర్‌లో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించే సౌకర్యం, ఉస్మానియా క్యాంపస్‌లో సైక్లింగ్ వెల్‌డ్రోమ్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, జింఖానా–2 గ్రౌండ్‌లో ఫుట్ బాల్ గ్రౌండ్‌తో పాటు ఔట్ డోర్ గేమ్స్ నిర్వహించే వసతులు ఉన్నాయని ఆ లేఖలో సీఎం రేవంత్ గుర్తుచేశారు.

క్రీడాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఏటా ఖేలో ఇండియా యూత్ గేమ్స్, వింటర్ గేమ్స్, పారా గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్ తదితరాలను 2018 నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నదని సీఎం రేవంత్ గుర్తుచేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పది రెట్ల మేర క్రీడల కోసం కేటాయింపులను పెంచినట్లు సీఎం రేవంత్ గుర్తుచేశారు.

కేవలం క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు మాత్రమే కాకుండా క్రీడాకారులు చేరుకునేలా రైలు, విమాన సౌకర్యాలు కూడా ఉన్నాయని, పేరెన్నికగన్న స్టార్ హోటళ్ళు, ఇతర వసతి సౌకర్యాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం మాత్రమే కాకుండా యువతను ప్రోత్సహించేలా ప్రత్యేక పాలసీని కూడా రూపొందిస్తున్నదని, ఆ శాఖను స్వయంగా ముఖ్యమంత్రే నిర్వహిస్తున్నట్లు కూడా ఆ లేఖలో పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ విజ్ఞప్తిని కేంద్ర మంత్రికి వివరించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి.... అంతర్జాతీయ స్థాయిలో మన దేశానికి క్రీడారంగంలో గుర్తింపు, పేరు ప్రఖ్యాతులు వచ్చేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నందుకు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ఒక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఆర్థికంగా మాత్రమే కాక అనేక రంగాల్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రత్యేక గుర్తింపు సాధించిందని, ఇకపైన క్రీడా పోటీల నిర్వహణతో పాటు భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన అవగాహనతో ఉన్నదని జితేందర్ రెడ్డి గుర్తుచేశారు.

కేంద్ర మంత్రితో జరిగిన ఈ సమావేశంలో జితేందర్ రెడ్డితో పాటు ఎంపీలు డాక్టర్ మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామ్‌రెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు.

## బీజేపీకి ఒక ఎంపీ సీటు?

మొదటి పేజీ తరువాయి..

సానుకూలంగా స్పందించారన్న ప్రచారం బీజేపీ వర్గాల్లో జరుగుతోంది.

### టీడీపీకి గవర్నర్ పదవి?

ఇదిలాఉండగా.. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో.. టీడీపీకి ఒక గవర్నర్ పదవి ఇచ్చేందుకు బీజేపీ నాయకత్వం అంగీకరించినట్లు, పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నిజానికి ఎన్టీఆర్ ఉన్నప్పుడు ఇద్దరికి గవర్నర్ పదవులు వచ్చిన సందర్భాలు లేకపోలేదు. తర్వాత మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుకు గవర్నర్ పదవి వస్తుందన్న ప్రచారం జరిగినప్పటికీ, అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకు వచ్చింది. దానితో పాపం మోత్కుపల్లి మీడియా గవర్నర్‌గా మిగిలిపోవలసి వచ్చింది. ఇప్పుడు మళ్లీ టీడీపీకి గవర్నర్ పదదవి ఇచ్చేందుకు, బీజేపీ సుముఖంగా ఉందన్న చర్చకు తెరలేచింది. ఆ ప్రకారం టీడీపీకి గవర్నర్ అవకాశం వస్తే అశోక్‌గజపతి రాజుకే ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ప్రస్తుతం పార్టీలో ఉన్నవారిలో యనమల రామకృష్ణుడు, కెఇ కృష్ణమూర్తి, దాడి వీరభద్రరావు సీనియర్లు. వీరిలో కెఇ కృష్ణమూర్తి ఆరోగ్యం అంతా బాగాలేకపోవడంతో, ఆయన క్రియాశీల రాజకీయాల్లో పెద్దగా కనిపించటంలేదు. ఇక ఎమ్మెల్సీ యనమలకు వరసగా అవకాశాలు వస్తూనే ఉన్నాయి. ఆయన కుమార్తె, వియ్యంకుడికి ఎమ్మెల్యే, అల్లుడికి ఎంపీ సీటు ఇవ్వడం తెలిసిందే. ప్రస్తుతం ఆ ముగ్గురూ అసెంబ్లీ, లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అనుభవం–హుందాతనం–వయసుపరంగా చూస్తే యనమలతోపాటు మరో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కూడా, గవర్నర్ పదవికి అర్హులేనని పార్టీ నాయకులు చెబుతున్నాయి. అయితే దాడి వీరభద్రరావు ఎన్నికల ముందు టీడీపీలో చేరినప్పటికీ, రాజకీయాల్లో ఇంకా చురుకుగా వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేశారు. ఈ నేపథ్యంలో ఒకవేళ టీడీపీకి గవర్నర్ అవకాశం వస్తే, అశోక్‌గజపతిరాజుకే ఎక్కువ అవకాశాలున్నట్లు సీనియర్లు చెబుతున్నారు.

## ఈనాడు, ఆంధ్రజ్యోతిపై పరువునష్టం దావా

మొదటి పేజీ తరువాయి..

చూశాక, తీసుకున్న నిర్ణయాల ద్వారా జరిగింది. ప్రభుత్వ పథకాలు గ్రామాల్లోనూ డోర్ డెలివరీ చేశాం.ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థ.వాలంటీర్ల వ్యవస్థ. దాదాపు 540 రకాల సేవలు అందించాం. ప్రతి ఇంటికి మంచి చేశాం. ఎక్కడా, లంచాలు, వివక్ష లేదు.

క్యాలెండర్ ఇచ్చి మరీ పథకాలు అమలు చేశాం. ఇది దేశంలో ఎక్కడా జరగలేదు. ఏకంగా రూ.2.73 లక్షల కోట్లు నేరుగా బదిలీ చేశాం. ప్రతి ఇంటికి మేలు చేశాం. ఈరోజు మళ్లీ జన్మభూమి కమిటీలు వచ్చాయి. పథకాల కోత మొదలైంది. ఏ పని కావాలన్నా టీడీపీ నాయకుల ఇళ్లు తిరగాల్సిందే. బడులు పూర్తిగా మార్చాం. ప్రైవేటుకు ధీటుగా వాటిని అభివృద్ధి చేశాం. ఇంగ్లిష్ మీడియమ్‌తో మొదలు పెడితే, సీబీఎస్‌ఈ, ఐబీ వరకు తీసుకొచ్చాం. 3వ తరగతి నుంచే టోఫెల్ శిక్షణ. డిజిటల్ క్లాస్‌రూమ్స్. ట్యాబ్‌లు, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, పూర్తి ఫీజు చెల్లింపు, అమ్మ ఒడి, మ్యాండేటరీ ఇంటర్న్‌షిప్ మొదలుపెడితే కరికులమ్‌లో మార్పులు.

గ్రామంలోనే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటి వద్దనే వైద్యం. విలేజ్ క్లినిక్స్, నాడు–నేడుతో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఆస్పత్రులు బాగు పడ్డాయి. 52 వేల పోస్టులు భర్తీ చేసి జీరో వేకెన్సీ తెచ్చాం. రాష్ట్రంలో స్పెషలిస్టుల కొరత కేవలం 4 శాతం. అది జాతీయ స్థాయలో 61 శాతం. 3300 చికిత్సలు ఆరోగ్యశ్రీలో. ఆరోగ్య ఆసరా వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే. ఒకేసారి 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు మొదలైంది మా ప్రభుత్వ హయాంలోనే.

చేయి పట్టుకుని రైతులను నడిపించాం. ఈ–క్రాప్ వ్యవస్థ, ఆర్బీకేలు, దళారుల ప్రమేయం లేకండా పంటల కొనుగోలు. అదే ఈరోజు అన్ని వ్యవస్థలు తిరోగమనమే. ప్రతి రోజూ రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెస్పీ కంటే దాదాపు రూ.400 కంటే తక్కువకు రైతులు ధాన్యం అమ్ముకుంటున్నారు. దళారుల చేతిలోనే అన్నీ.

ప్రతి క్వార్టర్ అయిపోగానే, ఫీజులు చెల్లించేవాళ్లం. ఇప్పటికీ మూడు క్వార్టర్లు పూర్తి కాగా, జనవరికి నాలుగు క్వార్టర్లు. ఆ మేరకు పిల్లల ఫీజులు బకాయిలు. కాలేజీల్లో పిల్లలను వెనక్కు పంపుతున్నారు. బడులకు పోయే పిల్లలు పంట పొలాల్లో పని చేస్తున్నారు. రూ.2800 కోట్లు విద్యాదీవెన బకాయిలు. రూ.1100 కోట్లు వసతి దీవెన బకాయిలు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.2200 కోట్లు దాటాయి. ఆరోగ్య ఆసరా ఊసే లేదు. 108, 104 సర్వీసులు మూలనబడ్డాయి. వాలంటీర్లను తొలగించారు. వారికి రూ.10 వేలు ఇస్తామని పచ్చిగా మోసం చేశారు. అన్ని వ్యవస్థలు దారుణంగా వెనక్కు పోయాయి. రాష్ట్రానికి ఉన్న ఆదాయం పెరిగేలా ప్రభుత్వం ఏదైనా చేస్తే, దాన్ని సంపద సృష్టి అంటారు. రాష్ట్ర పురోగతి కోసం ఎక్కడైనా ఆదాయం పెరిగే ఆలోచన చేయాలి. నిజానికి అది కేవలం వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగింది. దాదాపు రూ.12 వేల కోట్లతో మూడు కొత్త పోర్టుల నిర్మాణం. పనులు కూడా వేగంగా జరిగాయి. ఒక పోర్టు దాదాపు 65 శాతం పూర్తి అయింది. నిజానికి వాటికి ప్రత్యేకంగా ఫండ్ కూడా అవసరం లేదు, నిజానికి ఆ పోర్టులు పూర్తైతే, ఎంతో ఆదాయం వచ్చేది. ఆ పోర్టులు రేపు లక్షల కోట్లు విలువ చేస్తాయి.

అదే విధంగా మెడికల్ కాలేజీలు. 17 కాలేజీలు కడుతుంటే, 5 మా హయాంలోనే పూర్తయ్యాయి. మరో మూడింటిలో ఎంసీఐ సీట్లు కూడా కేటాయించింది. ఇలాంటి ప్రాజెక్టులు పూర్తైతే దాన్ని సంపద సృష్టి అంటారు. ఒక సీపోర్టు వస్తే, ఉద్యోగాలు వస్తాయి. జీఎస్‌డీపీ పెరుగుతుంది. మెడికల్ కాలేజీలు వస్తే వైద్యం ఖర్చులు తగ్గుతాయి. దాన్నే సంపద సృష్టి అంటారు. నిజానికి ఆదిశలో ఆరోజుల్లో విప్లవాత్మక మార్పులకు అడుగులు పడ్డాయి.

ఆరోజుల్లో దాదాపు 18 లక్షల పంప్‌సెట్లు. దానికి ఉచిత కరెంటు కోసం దాదాపు రూ.9 వేల కోట్ల ఖర్చు. అలాంటి పరిస్థితుల్లో.. చంద్రబాబు 5 ఏళ్ల పాలన చూస్తే.. విద్యుత్ రంగం దారుణం. డిస్కమ్‌లు పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయాయి. డిస్కమ్‌ల పరిస్థితి చూస్తే, చంద్రబాబు రాకముందు రూ.29 వేల కోట్ల అప్పులు, బకాయిలు ఉంటే, ఆయన దిగిపోయేనాటికి అవి ఏకంగా రూ.86 వేల కోట్లకు ఎగబాకాయి. దాదాపు 23.88 శాతం సీఏజీఆర్. డిస్కమ్‌ల నష్ట పరిస్థితి. ప్రభుత్వం నుంచి డిస్కమ్‌లకు సపోర్టు చూస్తే.. రూ.13,255 కోట్లు మాత్రమే చేయగా, మా ప్రభుత్వ హయాంలో రూ.47,800 కోట్లు. ఆ విద్యుత్‌ను 20 ఏళ్లపాటు ఉచితంగా ఇచ్చేలా, ప్రభుత్వం ఒక ఆలోచన చేసింది.

2020 నవంబర్ లో 6,400 మెగావాట్లకు సంబంధించి టెండర్లు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో, సోలార్ పార్కులు రాష్ట్రంలో పెట్టాలని టెండర్లు పిలిచాం. ఆ టెండర్లలో రూ.2.49 నుంచి రూ.2.58 చొప్పున సరఫరాకు ఎన్టీపీసీ వంటి పెద్ద సంస్థలన్నీ పాల్గొన్నాయి. దాదాపు 24 బిడ్లు దాఖలయ్యాయి. కానీ దురదృష్టవశాత్తూ మనం ఈ ప్రాజెక్టులు స్టార్ట్ చేయాలంటే చంద్రబాబు అనే చంద్రగ్రహణం కూడా మనకు ఉంది కాబట్టి, రకరకాల పద్ధతుల్లో కోర్టుల్లో ఈ ప్రక్రియ అంతా ఆపేసే కార్యక్రమం జరిగింది. కోర్టుల ద్వారా ఆగిపోయిన పరిస్థితులు కనిపించాయి. 2020 నవంబరులో ఆ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి, ఆ తర్వాత వివిధ కోర్టుల్లో దీని కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. 2021, సెప్టెంబరు 15న, రాష్ట్ర ప్రభుత్వానికి తీయటి కబురు వచ్చింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ నుంచి లేఖ వచ్చింది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి వచ్చిన లేఖ సారాంశం చూస్తే.. 6400 మెగావాట్ల సోలార్ విద్యుత్ సరఫరా చేయడానికి సిద్ధమని ప్రకటించింది. ప్రభుత్వానికి వచ్చిన అతి తక్కువ ధర రూ.2.49 చూశాం. మీరు రైతులపై చూపుతున్న శ్రద్ధను అభినందిస్తున్నాం. డిస్కమ్‌ల మీద భారం తగ్గిస్తూ, రైతులను ఆదుకుంటున్న విధానాన్ని, వారికి ఉచిత విద్యుత్ ఇవ్వడాన్ని ప్రశంసిస్తూ, ఆ విద్యుత్‌ను తామే రూ.2.49కే ఇస్తామని సెకీ వెల్లడించింది.

అంతే కాకుండా, వారు చెప్పిన ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే.. ఒక స్పెషల్ ఇన్సెంటివ్‌గా.. ఐఎస్‌టీఎస్ (ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ ఛార్జెస్)ను 25 ఏళ్లపాటు రద్దు చేస్తామని వెల్లడించారు. అలా 2026 నాటికి మొత్తం మీద 9 వేల మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరా చేస్తామని సెకీ వివరించింది.

ఇవీ ఆ లేఖ ముఖ్యాంశాలు. టేక్ ఎవేస్: నేను ఒక్కటే అడుగుతున్నాను. ఆ లెటర్‌లో టేక్ ఎవేస్ చూస్తే..

1. కేంద్ర సంస్థ సెకీతో ప్రభుత్వం నేరుగా జరిపిన లావాదేవీ ఇది. ఇక్కడ మూడో వ్యక్తి ఎవరూ లేరు. ఇంకా చెప్పాలంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం మధ్య విషయం.

2. యూనిట్ రూ.2.49కే. ఇది రాష్ట్ర చరిత్రలో అతి తక్కువ ఖర్చుతో వచ్చే విద్యుత్.

3. ఈ ప్రాజెక్టుకు మాత్రమే ఐఎస్‌టీఎస్ (ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ ఛార్జెస్) ఉండదు. ఇది స్పెషల్ ఇన్సెంటివ్‌గా ఇస్తున్నామని చెప్పడం.

గతంలో రాష్ట్రంలో సగటు విద్యుత్ కొనుగోలు ధర రూ.5.10. అదే మనకు 17 వేల మిలియన్ యూనిట్లు కేవలం రూ.2.49కే ఇవ్వడానికి కేంద్ర సంస్థ ముందుకు వచ్చింది. అంటే ఒక్కో యూనిట్ ధర ఇక్కడ రూ.2.60 తగ్గింది. దీని వల్ల ఏటా రూ.4400 కోట్లు. 25 ఏళ్లలో ఆ మొత్తం దాదాపు రూ.1.10 లక్షల కోట్లు. మరి అది సంపద సృష్టి కాదా?

కేంద్రం నుంచి ఇలాంటి ఆఫర్ వస్తే.. అతి తక్కువ ధరకు విద్యుత్. ఐఎస్‌టీఎస్ మాఫీ. 25 ఏళ్లలో మీకు లక్ష కోట్లకు పైగా ఆదా. రైతులకు మంచి చేసేందుకు మీతో కలిసి వస్తామని అంటే.. అలాంటి లెటర్‌ను పక్కన పెడితే, మీరంతా నన్ను ఏమనేవారు? ఇదే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 ఏమని విమర్శించేవారు. ఆలోచన చేయమని కోరుతున్నాను. రాష్ట్రానికి మంచి చేయాలని నేను అడుగులు ముందుకు వేస్తే, బురద చల్లుతున్నారు. వారు చేస్తోంది ధర్మమేనా? మనమంతా అడగాలి. చంద్రబాబుకు అన్నీ తెలుసు. అయినా ఆయనే ఆ నింద వేస్తున్నారు.రూ.2.49కే యూనిట్ పవర్. ఇది ఒక చరిత్ర. కేవలం మా ప్రభుత్వం వల్లనే స్వాధ్యమైంది. అది చరిత్రాత్మక ఒప్పందం. అలాంటి ఒప్పందాన్ని తప్పుబడుతున్నారు. ఆరోపణలు చేస్తున్నారు.

### చంద్రబాబు హయాంలో విద్యుత్ కొనుగోళ్లు

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014%–%19 మధ్య 3494 మెగావాట్లకు సంబంధించి 133 పీపీఏలు చేసుకున్నారు. ఆ పీపీఏలు గమనిస్తే.. రూ.4.84 నుంచి రూ.4.83 వరకు ఉన్నాయి. 2014లో మాత్రం రూ.4.70కి వచ్చింది. సోలార్ కు సంబంధించి.. 2500 మెగావాట్లకు ఆయన పీపీఏ చేసుకున్నారు. 2014లో 650 మెగావాట్లు సగటున రూ 6.49కు కొనుగోలుకు చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారు. రూ.5.25 నుంచి రూ.6.99 మధ్య ఒప్పందం చేసుకున్నారు. 2015లో రూ.5.96 కు మరో 250 మెగావాట్లకు ఒప్పందం. 2016లో రూ.6.80, రూ.5.99, రూ.4.61, రూ.4.50 కి కొనుగోలు చేశారు. ఆయన సోలార్ ఎనర్జీని యావరేజ్ గా రూ.5.90కి కొనుగోలు చేశారు.

### అతి తక్కువ రేట్‌కు పీఎస్‌ఏ చేసుకోవడం తప్పా?

చంద్రబాబు హయాంలో విండ్ పవర్ యావరేజ్ యూనిట్ ప్రైస్ రూ.4.63 అయితే.. సోలార్ యూనిట్ రూ.5.90. మరి నేను రూ.2.49కు అంటే చంద్రబాబు పెట్టిన దానిలో సగం రేటుకు కొనుగోలు చేస్తే.. చీపెస్ట్ రేట్ కి పవర్ సరఫరా చేస్తామని కేంద్ర ప్రభుత్వం నాకు లేఖ రాస్తే.. ఐఎస్‌టీఎస్ చార్జెస్ మాఫీ చేస్తామని చెబితే.. నేను స్పందించకపోయి ఉంటే నన్ను మీరేమని ఏమనేవారు? స్పందించిన నేను మంచి వాడినా.. అంత దిక్కుమాలిన రేట్లకు పీపీఏలు చేసుకున్న చంద్రబాబు మంచి వాడా?

### ఎవరికి సంపద సృష్టి. ఎవరికి ఆవిరి?

చంద్రబాబు హయాంలో సంపద ఎలా ఎరోడ్ (ఆవిరైపోయిందో) అయిందో చెబుతాను. చంద్రబాబు సోలార్, విండ్ పీపీఏలను వైయస్సార్‌సీపీ చేసుకున్న సోలార్ ఒప్పందంతో పోలిస్తే.. అవన్నీ 25 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రభుత్వంపై మోపుతున్న భారం.. రాష్ట్ర ప్రభుత్వం మోయాల్సిన భారం ఇది. ఇదే మాదిరిగా చూస్తే.. 3500 విండ్ పీపీఏలకు సంబంధించి ఆయన చేసుకున్న రూ.4.84లు మైనస్ మనం చేసుకున్న రూ.2.49. అంటే రూ.2.35 రాష్ట్ర ప్రభుత్వం అదనంగా కట్టాల్సి వస్తుంది. ఇంటూ 3500 మెగావాట్లు అంటే 9000 మిలియన్ యూనిట్లు.. అంటే రూ.2.35 ఇంటూ 9000 మిలియన్ సంవత్సరానికి రూ.2 వేల కోట్లు.. 25 ఏళ్లలో రూ.50 వేల కోట్లు కేవలం చంద్రబాబు చేసుకున్న విండ్ యూనిట్ల వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై భారం. సోలార్ ఎనర్జీ ఒప్పందాలు చూస్తే.. చంద్రబాబు 2400 మెగావాట్లు ఆయన చేసుకున్న ఒప్పందం.. యావరేజ్ ప్రైస్ రూ.5.90.అదే మేము ఒప్పందం చేసుకున్నది రూ.2.49. అంటే రూ.3.41 ఆయన చేసుకున్న పీపీఏల వల్ల రాష్ట్ర ప్రభుత్వం అదనంగా కట్టాలి కదా? 2400 మెగావాట్లు అంటే.. 4200 మిలియన్ యూనిట్లు ఇంటూ రూ.3.41. ఏడాదికి 1500 కోట్లు సంవత్సరానికి భారం పడుతుంది. రూ.1500 కోట్లు ఇంటూ 25 ఏళ్లు అంటే.. రూ.37500 కోట్లు..

జగన్ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందం వల్ల 25 ఏళ్లలో రూ.1.10 లక్షల కోట్ల సంపద సృష్టి జరుగుతుంటే.. చంద్రబాబు చేసుకున్న సోలార్, విండ్ ఒప్పందాల వల్ల.. 25 ఏళ్లలో రూ.87,500 కోట్ల సంపద ఆవిరవుతుంది. తేడా గమనించండి.

సెకీ లేఖ. పరిణామాలు. ఒప్పందం

సెకీ నుంచి 2021, సెప్టెంబరు 15న లేఖ రాగా, ఇటువంటి మంచి ఆఫర్ రావడంతో, ఆ మర్నాడే క్యాబినెట్ మీటింగ్ ఉండగా, దాన్ని టేబుల్ ఐటెం కింద పెట్టాం. అంటే సెప్టెంబరు 16న క్యాబినెట్‌లో చర్చించాం. ఎనర్జీ శాఖ అన్నీ అధ్యయనం చేసి వచ్చే క్యాబినెట్ నాటికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దాదాపు 40 రోజుల పాటు అన్నీ అధ్యయనం చేసిన ఇంధన శాఖ కమిటీ, 2021, అక్టోబరు 25న నివేదిక సమర్పించింది.

ఆ తర్వాత అక్టోబరు 28న క్యాబినెట్ జరగ్గా, ఆ నివేదికను క్యాబినెట్ ముందు ఉంచడం జరిగింది. అన్నీ చర్చించిన తర్వాత క్యాబినెట్ ఏం చెప్పిందంటే, ఏపీఈఆర్‌సీ అనుమతి కూడా తీసుకోవాలని నిర్దేశించి, ఆమోదం తెలిపింది. ఆ తర్వాత నవంబరు 11న ఏపీఈఆర్‌సీ క్లియరెన్స్ ఇచ్చింది. ఆ క్రమంలో డిసెంబరు 1, 2021న ప్రభుత్వం, సెకీ మధ్య పవర్‌సేల్ అగ్రిమెంట్(పీఎస్‌ఏ) జరిగింది. దాంట్లో ఎవరెవరు సైన్ చేశారంటే.. సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, నాలుగు డిస్కమ్‌లు సంతకాలు చేశారు. ఇక్కడ ఎక్కడా థర్డ్ పార్టీ లేదు. స్పష్టంగా చెప్పాలంటే.. అది సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కమ్‌ల మధ్య జరిగిన ఒప్పందం. దానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి కూడా ముందే ఇచ్చింది.

ఆ ఒప్పందం కనుక చేసుకోకపోయి ఉంటే..

ఒక చరిత్రాత్మక ఘట్టం చోటు చేసుకుంటే.. రూ.2.49కే విద్యుత్ మన రాష్ట్రానికి దొరుకుతుంటే, ఇంకా స్పెషల్ ఇన్సెంటివ్‌గా ఐఎస్‌టీఎస్ మాఫీ. అదెంతో తెలుసా? ఒక్కో యూనిట్‌కు రూ.2. అంటే ఒక్కో మెగావాట్‌కు నెలకు దాదాపు రూ.4 లక్షలు. అంటే ఏడాదికి దాదాపు రూ.50 లక్షలు అన్నమాట.

అంత తక్కువ ధరకు మనకు సోలార్ విద్యుత్ వచ్చింది. ఆత్మ నిర్భల్ భారత్ కింద, సౌర విద్యుత్‌ను ప్రోత్సహిస్తూ, కేంద్రం మనకు ఆ ఇన్సెంటివ్ ఇచ్చింది. అంత మంచి ఆఫర్‌ను నేను పక్కనపడేసి ఉంటే, అదే మీరు ఏమనేవారు? 25 ఏళ్లలో దాదాపు రూ.1.10 లక్షల కోట్లు ఆదా. అంటే అది సంపద సృష్టి కాదా? నిజానికి అది ఒక రోల్‌మోడల్ కేసు.

### అప్పుడు కూడా ఇతర రాష్ట్రాల్లో ఎక్కువ ధర

ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం తెలుసా? ఇదే సెకీ, అదే ఆత్మ నిర్భల్ భారత్ కింద.. తమిళనాడుకు కూడా విద్యుత్ సరఫరా చేసింది. చత్తీస్‌గడ్ రూ.2.61. ఒడిషా రూ.2.61. తమిళనాడు రూ.2.61. అదే మన రాష్ట్రానికి 12 పైసలు తక్కువగా రూ.2.49కే తెస్తే, నన్ను సన్మానించాల్సింది పోయి, ఏం విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు సంపద ఆవిరి చేస్తే, నేను సృష్టించాను. మరి ధర్మం, న్యాయం ఎక్కడుంది?

### పిచ్చి రాతలు

ఇక ఎల్లో మీడియా రాతలు. వారికి తోడు తానా అంటే తందానా అంటూ, చంద్రబాబు, ఆయన పార్టీ నేతలు, ఇతర పార్టీల్లో ఉన్న ఆయన మనుషులు, హాఫ్ బేక్డ్ నాలెడ్జ్ ఉన్న వాళ్ల పిచ్చి విమర్శలు. గుజరాత్‌లో రూ.1.99కే విద్యుత్ ఉత్పత్తి చేస్తుంటే, మనం రూ.2.49కి ఎందుకు కొన్నామని అంటున్నారు. అక్కడి పరిస్థితులు వేరు. ఇర్రేడియేషన్ స్థితి. ఎడారి ప్రాంతాల్లో ఉత్పత్తి వ్యయం తక్కువ.

కానీ, చంద్రబాబు, ఎల్లో మీడియా అతి తెలివి ప్రదర్శిస్తూ.. గుజరాత్, రాజస్థాన్‌లో ఉత్పత్తి వ్యయం గురించి మాట్లాడుతున్నారు. కానీ, ఆయా రాష్ట్రాల్లో ట్రాన్స్‌మిషన్ ఛార్జీలు ఎంతో తెలుసా? యూనిట్‌కు రూ.1.98. మరి ఈనాడు గుజరాత్ గురించి రాశారు. అక్కడ యూనిట్ ఉత్పత్తి వ్యయం రూ.1.99 అంటున్నారు. మరి ఎక్కడ ఉత్పత్తి? ఎక్కడ వినియోగం? చూడాలి కదా?

అంటే గుజరాత్‌లోనే ఉత్పత్తి చేసి, ఆ రాష్ట్రంలోనే సరఫరా చేస్తున్నారు. అంటే మొత్తం అంతా రాష్ట్రంలోనే. అందుకే వారికి ఆ రేట్లు వర్తిస్తున్నాయి. వారికి అక్కడ ఇర్రేడియేషన్ లెవెల్ వల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం రూ.1.99. రాజస్థాన్‌లో చూస్తే, అదే స్థితి. ఉత్పత్తి, సరఫరా అంతా ఒకే రాష్ట్రంలో. అయినా ఈనాడులో అది రాయరు. కేవలం ఉత్పత్తి వ్యయం తక్కువ అని మాత్రమే చెబుతారు. అక్కడ కూడా ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ ఛార్జీలు లేవు. మరి అలా రాయడం వక్రీకరణ కాదా?

కోవిడ్ తర్వాత, తాజాగా గుజరాత్‌లో సెకీ టెండర్లు చూస్తే.. 2024, మార్చి 15న టెండర్ల బిడ్లు చూస్తే, రూ.2.62 నుంచి రూ.2.67 వరకు ధర. అంటే గుజరాత్‌లోనే ఉత్పత్తి. ధర. రాజస్థాన్‌లో కూడా బిడ్లు చూస్తే.. దాదాపు అవే ధరలు. అంటే ప్రస్తుత రెన్యూవబుల్ ఎనర్జీ రేట్లు ఇలా ఉన్నాయి.

ఆ లెక్కన రూ.1.50కే రావాలి కదా?:

మనకు అక్కడి జనరేషన్ కాస్ట్ కంటే తక్కువకు రూ.2.49కే వచ్చాయని సంతోషపడాలి. ఈనాడులో ఏం రాశారు? ఏళ్లు గడుస్తున్న కొద్దీ కొత్త మోడళ్ల టీవీల ధరలు తగ్గుతాయి. అలాగే విద్యుత్ ఛార్జీలు కూడా టెక్నాలజీ పెరిగిన తర్వాత తగ్గాలి కదా? అంటున్నారు. ఆ ప్రకారం, ఈనాడు థియరీ ప్రకారం చూస్తే.. అదే గుజరాత్‌లో సోలార్ పవర్ ఇవాళ రూ.1.50కే రావాలి కదా? మరి రూ.2.67 వరకు ఎందుకు పోయింది? అంటే ఏ స్థాయిలో అబద్ధాలు చెబుతున్నారనే దానికి ఇవన్నీ ఉదాహరణలు.

మీడియా ప్రశ్నలకు సమాధానంగా..

చంద్రబాబు ఆ ఒప్పందాలు రద్దు చేసుకుంటే.. ఎవరూ అంత తెలివి తక్కువగా ఆ పని చేయరు. అంత తక్కువ ధరకు విద్యుత్ దొరకదు. పైగా 25 ఏళ్లలో లక్ష కోట్లకు పైగా ఆదా. 2009 నుంచి చూస్తే.. రూ.3.70 మొదలు చంద్రబాబు హయాంలో రూ.6.99 వరకు చేరింది. మా హయాంలో ఒకే అగ్రిమెంట్. యూనిట్ ధర రూ.2.49. అంత తక్కువ ధరకు ఎవరూ కొనుగోలు చేయలేరు. ఇది వాస్తవం. ఇంకా చెప్పాలంటే చరిత్రాత్మకం.

డిస్కమ్‌లు కరెంటు కొంటున్నాయి. సెకీ సరఫరా చేస్తోంది. మేము యూనిట్‌కు రూ.2.49 చొప్పున సెకీకి చెల్లిస్తున్నాం. అది అప్పట్లో చాలా తక్కువ ధర. పైగా ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ ఛార్జీల మాఫీ. అంత మంచి ఆఫర్ ఎవరైనా వదులుకుంటారా? మీరే చెప్పండి. దాని వల్ల ఏటా రూ.4400 కోట్లు ఆదా. అంటే 25 ఏళ్లలో రూ.1.10 లక్షల కోట్లు ఆదా.

ఈనాడు, ఆంధ్రజ్యోతిపై పరువునష్టం దావా

అన్ని వాస్తవాలు మరుగు పరుస్తూ, రోజూ నాపై దుష్ప్రచారం చేస్తూ, ఈనాడు, ఆంధ్రజ్యోతి పచ్చి అబద్ధాలు రాస్తున్నారు. అందుకే వారిపై నష్టం దావా వేయబోతున్నాను. రూ.100 కోట్లకు దావా వేయబోతున్నాను. వారు నా ప్రతిష్టకు భంగం వాటిల్లేలా చేస్తున్నారు. వాస్తవాలు మరుగునపర్చి, పచ్చి అబద్ధాలు వండి వారుస్తున్నారు. యూనిట్ వపర్ రూ.2.49కే కొనడం, ఐఎస్‌టీఎస్ మాఫీ.. అవన్నీ దాచిపెట్టి, నాపై ఆరోపణలు చేస్తున్నారు.

అదే పనిగా, నన్ను నిందిస్తున్నారు. నా పేరు ప్రఖ్యాతలు నాశనం చేయాలని చూస్తున్నారు. రెప్యుటేషన్ దెబ్బ తీస్తున్నారు. అందుకే 48 గంటల సమయం ఇచ్చి, క్షమాపణ చెప్పాలని కోరుతాను. వారు ఆ పని చేయకపోతే, రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేస్తాను. ఒకవేళ, నేను సెకీ లేఖను పక్కనపెట్టి ఉంటే, ఏమనేవారు? అది కేంద్ర ప్రభుత్వ సంస్థ కాబట్టి, నీకు ఏ ప్రయోజనం కలగదు కాబట్టి, పట్టించుకోలేదని, ప్రైవేటు ఒప్పందాలకు ప్రాముఖ్యం ఇస్తున్నానని రాసేవాళ్లు. డీబీటీలో రూ.2.73 లక్షల కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేశాం. అంత సాహసం ఎవరూ చేయరు. ఎందుకంటే, దాని వల్ల ఎవరికీ లంచాలు రావు. కానీ మేం చేసి చూపాం. విద్యా రంగంలో మార్పులు చేసి, చరిత్ర సృష్టించాం.

అన్నీ ఆధారాలతో మాట్లాడాను. సాక్ష్యాలు కూడా చూపాను. పరువు నష్టం దావా కూడా వేస్తున్నాను. అన్నీ ఓపెన్‌గా చెబుతున్నాను. అసెంబ్లీలో బడ్జెట్‌లో ప్రభుత్వ అప్పు రూ.6.46 లక్షల కోట్లు అని డాక్యుమెంట్‌లో స్పష్టంగా చూపినా, బయట ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు.

రాష్ట్ర అప్పు రూ.10 లక్షల కోట్లు అని, రూ.12 లక్షల కోట్లు అని అసత్యాలు చెబుతున్నారు. దీనికి హద్దూ, అదుపు ఉండదా? సోషల్ మీడియాలో పోస్టులు పెడితే, పీడీ యాక్ట్ కింద కేసు పెడుతున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఎంత దారుణంగా ఉందో తెలుస్తుంది. ఇక్కడ యథేచ్ఛగా చట్ట ఉల్లంఘన జరుగుతోంది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 29, నవంబర్ 2024





# వైసీపీ నేత విజయ్‌బాబుపై హైకోర్టు సీరియస్

- 50 వేల జరిమానా
- ఖరీదైన ఫోన్లు వాడేవారి కోసం పిల్ వేస్తారా?
- కిరాయి మూకలుగా పని చేస్తూ సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిని శిక్షించాల్సిందే
- హక్కులు తెలియకుండా సోషల్ మీడియాలో పోస్టులు ఎలా పెడతారు?



అమరావతి,మహానాడు:

వైసీపీ మద్దతుదారు, విశ్రాంత పాత్రికేయుడు విజయ్ బాబుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని అరెస్ట్ చేస్తున్నారంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సీరియస్ అయింది. ఆయనకు రూ.50 వేల జరిమానాను విధించింది. రాజకీయ దురుద్దేశంతోనే ఈ పిటిషన్ వేశారని ఆయన పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ రూ.50 వేల జరిమానాను విధించింది. నెల రోజుల్లో లీగల్ సర్వీసెస్ అథారిటీలో రూ.50 వేలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది.

ఈ పిటిషన్ ద్వారా ప్రజాప్రయోజన వ్యాజ్యం ఉద్దేశాలను విస్మరించారని, అసలు తమ హక్కులు తెలియకుండా సోషల్ మీడియాలో పోస్టులు ఎలా పెడతారు? సోషల్ మీడియా పోస్టులు పెట్టేవారు ఖరీదైన ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైజ్‌లు వాడుతున్నా రు. ఇలాంటి వారి తరపున పిల్ వేయాల్సిన అవసరమేమిటని ప్రశ్నించింది. సమాజంలో తమ బాధను చెప్పుకోలేని వారి కోసం వేయాల్సిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని రాజకీయ దురుద్దేశంతో వేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

సోషల్ మీడియాలో కుటుంబ సభ్యులను కించపరిచే విధంగా వల్గర్ లాంగ్వేజ్ వాడుతున్నారని, సోషల్ మీడియాను ఇష్టానుసారం వినియోగించుకుంటే న్యాయపరంగా అది నేరమేనని హైకోర్టు స్పష్టం చేసింది. కిరాయి మూకలుగా పని చేస్తూ సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిని శిక్షించాల్సిందేనని చెప్పింది. వైసీపీ హయాంలో విజయ్ బాబు అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పని చేశారు.

# ఇథనాల్ కంపెనీపై ఎక్కడంటే అక్కడ చర్చకు సిద్ధం

- ఇథనాల్ కంపెనీతో నాకొడుకు సాయి కిరణ్ కు సంబంధం లేదు
- సంబంధం ఉన్నట్లు నిరూపిస్తే.. కంపెనీ వాళ్లకే రాసిస్తా
- పీసీసీ చీఫ్, మంత్రి సీతక్క, ఎంపీ చామల కామెంట్స్‌ను ఖండించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్,మహానాడు:

అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకే కాంగ్రెస్ నేతల తప్పుడు ఆరోపణలు. ఇథనాల్ కంపెనీతో నా కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదు. ఇథనాల్ కంపెనీతో నాకొడుకు సాయి కిరణ్ కు ఎలాంటి సంబంధం లేదు. నా కుటుంబ సభ్యులకు సంబంధం ఉన్నట్లు నిరూపిస్తే.. కంపెనీ వాళ్లకే రాసిస్తా.

పీసీసీ చీఫ్ కు నా సవాల్. ఇథనాల్ కంపెనీపై ఎక్కడంటే అక్కడ చర్చకు సిద్ధం. సందర్భం వచ్చినప్పుడు నాపై తప్పుడు ఆరోపణలు చేస్తోన్న వారికి నేనేంటో చూపిస్తాను. ఇథనాల్ కంపెనీకి పర్మిషన్ తో నాకు ఎలాంటి సంబంధం లేదు. టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు.. 2016 లో రాజమండ్రి ప్రాంతంలో నా కుమారుడు వేరే కంపెనీని పెట్టాలనుకున్నది వాస్తవం. అయితే మూడు నెలలకే కంపెనీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. కంపెనీ పెట్టించే వాళ్లం మేమే అయితే.. రైతులను మేమెందుకు రెచ్చగొడతాం? బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని పేర్కొనడం విడ్డూరం. ఇథనాల్ కంపెనీకి అనుమతులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం అన్న విషయం కూడా తెలుసుకోరా? బాధ్యతగల పదవిలో ఉన్నవారు ఆచితూచి ఆరోపణలు చేయాలి. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా.. కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది.

నన్ను, బీఆర్ఎస్ పార్టీని బద్నాం చేసే ప్రయత్నం జరుగుతుంది. లగచర్ల సహా.. ప్రతిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అభాసు పాలవుతుంది. లేనివి ఉన్నట్లు చెప్పటం దుర్మార్గమైన చర్య. రైతులు చేస్తున్న ఆందోళనను పరిష్కరించకుండా తప్పుడు ఆరోపణలు మానుకోవాలి. గురుకులాల్లో విద్యార్థుల మరణంపై హైకోర్టు మొట్టికాయలు వేసింది.

# కూటమి ప్రతిష్ఠపై జెసి-ఆది 'బూడిద'

- కూటమి పెద్దల వార్నింగ్ బేఖాతర్
- ఆది- జేసీ రగడ
- రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్‌లో బూడిద దందాగిరి

(ఘంటా వీరభద్రరావు)



ఇద్దరూ అగ్రనాయకులే. పైగా ఇద్దరూ ఒకే సామాజికవర్గ నాయకులే. ఒకరు జమ్మలమడుగులో తిరుగులేని నాయకుడయితే, మరొకరు తాడిపత్రిలో ఎదురులేని నేత. ఆ ఇద్దరూ కూటమి నేతలే. ఒకరు బీజేపీ అయితే మరొకరు టీడీపీ. ఇప్పుడు ఇద్దరూ 'బూడిద'పై యుద్ధం చేస్తున్నారు. ఇది కూటమి ప్రతిష్ఠపై, బూడిద చల్లుతోందన్న ఆందోళన పార్టీ శ్రేణుల్లో మొదలయింది. చివరాఖరకు టీడీపీ నాయకత్వ హెచ్చరికలను కూడా ఖాతరు చేయకుండా, ఎవరి పట్టు వారు నిలబెట్టుకునేందుకు కత్తులు నూరుతున్నారు.



రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్‌లో బూడిద దందాగిరి సెమీ సంక్రాంతిని తలపిస్తోంది. ఈ బూడిద కోసం ఇటు తాడిపత్రి డేగ.. అటు జమ్ముల మడుగు కాకి రెక్కలు టపటపలాడించి.. గొంతు చించుకొంటున్నాయి. ఈ రెండు కోళ్ల సవాళ్ల కూతలతో ఆర్టీపీపీ దద్దరిల్లిపోతోంది. ఏ క్షణంలో ఈ కోళ్లు కత్తులతో ఏ బరిలో దిగుతాయో అర్థం కాక పోలీసులు తలపట్టుకుని.. సరిహద్దులను అష్టదిగ్బంధనం చేశారు. మరో వైపు అధికార కూటమి పెద్దలు తగ్గండి ..తగ్గండి లేదో తాట తీస్తాం అని హూంకరించినా.. ఆది జేసీ కోళ్లు ఎక్కడా తగ్గటం లేదు. ఎనీ హౌ ఈ రెండు వర్గాల బూడిద జగడం మూడో రోజుకు చేరింది. రెండు పిట్టల పోరు పిల్లి తీర్చ కూడదదంటూ ఇరు వర్గల మధ్య ఎడతెరపిలేని రాజీ చర్చలు యథాస్థితిలోనే ఉన్నాయి. ఎక్కడా ఏ ఒక్కరూ తగ్గటం లేదు. రాజీతంత్రం తెగటం లేదు. మిగిలింది ఒక్కటే.. హక్కు భుక్తం షరతు.

ఎవరు ఎవరికి హక్కు రాసివ్వాలో తేలటం లేదు. తాడిపత్రికి బూడిద తరలించటానికి జమ్మలమడుగు యువరాజుకు తాడిపత్రి మహారాజు అనుమతి ఇవ్వాలి. ఇది జేసీ బ్రదర్స్ నిబంధన. అది కాదు.. ఈ బూడిద హక్కు మాదే. మేమే తరలిస్తాం. కాంట్రాక్టులో సగం ఇస్తాం. ఇదీ జమ్మల మడుగు రాజన్న ఆది వర్గం షరతు. బూడిద తమ ఇలాఖాలో ఉంది కాబట్టి తమ వాహనాలతో తరలిస్తామని ఆదినారాయణరెడ్డి వర్గీయులు పేచీకి దిగారు. ఆ బూడిద వచ్చేది తాడిపత్రికి కాబట్టి తమ వాహనాల్లోనే తీసుకువెళ్తామని జేసీ వర్గం గొడవ పడుతోంది. ఇలా ఈ రెండు వర్గాల మధ్య పంచాయతీ రాజుకుంది. జేసీ ట్రిప్పర్లు వస్తే అడ్డుకుంటామని ఆదినారాయణ రెడ్డి వర్గం... భయపడేది లేదు.. వచ్చి తీరుతామని జేసీ వర్గం రంకెలేస్తోంది. ఈ స్థితిలో పోలీసులు అలెర్ట్ అయ్యారు. ముందు జాగ్రత్తగా మోహరించారు. అనంత పురం, కడప జిల్లా సరిహద్దు కొండాపురం మండలంలో చెక్ ఫోస్ట్ ఏర్పాటు చేశారు.

జేసీ ప్రభాకర రెడ్డి, ఆదినారాయణరెడ్డి.. ఇద్దరూ కూటమి నేతలే కావడం విశేషం. జేసీ తాడిపత్రిటీడీపీ నాయకుడు, ఆదినారాయణరెడ్డి బీజేపీ ఎమ్మెల్యే. వీళ్లిద్దరి మధ్య ఫ్లైయాష్ ఒప్పందంపై విభేదాలు తలెత్తాయి. జమ్మలమడుగులో ఆర్టీపీపీ నడుస్తోంది. తమ పరిధిలో ఏం జరిగినా తమ కనుసన్నల్లోనే జరగాలని ఆదినారాయణరెడ్డి భీష్మించారు. తాడిపత్రి ఏరియాలోని సిమెంట్ ఫ్యాక్టరీలకు ఫ్లైయాష్‌ను తరలిస్తున్నాయి. ఈ అంశంలోనే ఒప్పందం కుదరలేదు. ఈ స్థితిలో .. తాడిపత్రి ..జమ్మల మడుగు బూడిద జగడం ఏ స్థితికి దారి తీస్తుందో.. అంతా సస్పెన్స్.. టెన్షన్ ..టెన్షన్.

# రైతు మోసాల ఉత్సవాలు జరుపుకోండి

- కొనుగోలు కేంద్రాలులేక గోస పడుతుంటే విజయోత్సవాలు చేసుకుంటారా?
- రేవంత్ ప్రభుత్వానికి కొంచమైనా సిగ్గుండాలి
- 2 లక్షల రైతు రుణమాఫీ ఏకకాలంలో సంపూర్ణంగా చేస్తామన్నరు.. ఏమైంది?
- రేవంత్ రెడ్డి సొంతూర్లో కూడా రైతు రుణమాఫీ చేయలేకపోయారు
- పంటల బీమా పథకం సోనియా గాంధీకి, రాహుల్ గాంధీకి, ప్రియాంక గాంధీకి ఎవరికి గిఫ్ట్ గా ఇచ్చిన్రు?
- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ రెడ్డి



హైదరాబాద్,మహానాడు:

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో రైతులను దగా చేసి, రైతు పండుగ పేరిట మూడు రోజుల పాటు విజయోత్సవాలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. వరంగల్ డిక్లరేషన్ లో ఇచ్చిన 9 హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ సర్కారుకు విజయోత్సవాలు నిర్వహించుకునే అర్హత లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ రైతు విజయోత్సవాలకు బదులు.. రైతు మోసాల ఉత్సవాలు జరుపుకోవాలని ఎద్దేవా చేశారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాణి రుద్రమ రెడ్డి గారు మాట్లా డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో రైతులకు చేసిన మోసాలను ఎండగట్టారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తవుతున్న సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో 3 రోజుల పాటు రైతు విజయోత్సవ సభ పేరుతో కొత్త తరహా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రైతులకు ఏం ఒరగబెట్టకుండానే సంబరాలు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకునేవి రైతు విజయోత్సవాలు కాదు.. రైతు మోసాల ఉత్సవాలు. ఎన్నికలకు ముందు వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట 9 హామీలిచ్చి, రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చారు.

ఏడాది కాలంలో ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా.. ఇప్పుడు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు పంటను అమ్ముకుంటే సరైన మద్దతు ధర రాక, బోనస్ అందక, కొనుగోలు కేంద్రాలులేక గోస పడుతుంటే.. విజయోత్సవాలు చేసుకుంటారా..? రేవంత్ ప్రభుత్వానికి కొంచమైనా సిగ్గుండాలి. రైతులకు ఇచ్చిన 9 హామీలను నెరవేర్చనందుకు కాంగ్రెస్ పార్టీది మోసాల డిక్లరేషన్ గా ఒప్పుకొని తెలంగాణ రైతులను క్షమాపణ అడగాలి.

ఎన్నికల ముందు రాహుల్ గాంధీ సమక్షంలో ఎలాగైతే రైతు డిక్లరేషన్ ప్రకటించిన్రో.. ఇప్పుడు అదే రాహుల్ గాంధీని తీసుకొచ్చి రైతులకు క్షమాపణ చెప్పి విజయోత్సవాలు చేసుకోవాలి. లేదంటే రద్దు చేసుకుంటే వాళ్లిష్టం. సోనియమ్మ రాజ్యంలో ఇందిరమ్మ రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.15 వేల చొప్పున ప్రకటించి ఎగ్గొట్టింది. వ్యవసాయ కూలీలకు రూ. 15 వేలు, కౌలు రైతులకు రూ. 12 వేలు ఇస్తమన్నరు. ఈనాటికి ఏ ఒక్కరికీ రైతు భరోసా అందివ్వలేదు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ఏం వెలగబెట్టారని రైతు విజయోత్సవాలు చేసుకుంటున్నారు? అధికారంలోకి రాగానే రూ. 2 లక్షల రైతు రుణమాఫీ ఏకకాలంలో సంపూర్ణంగా చేస్తామన్నరు. ఏమైంది? ఆనాడు సోనియమ్మ సాక్షిగా.. పీవీ నర్సింహారావు, కాళోజీ, సమ్మక్క-సారలమ్మ, కాకతీయుల చరిత్ర పేరెత్తి వరంగల్ లో రైతు డిక్లరేషన్ ప్రకటించిన్రు. కనీసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతూర్లో కూడా రైతు రుణమాఫీ చేయలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నకిలీ లేని, నాణ్యమైన విత్తనాలు అందించలేకపోతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులన్నీ కల్తీ అవుతుండటంతో రైతులు నష్టపోతున్నరు.

అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ఫసల్ బీమా యోజన పథకం ప్రవేశపెడితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్నీ అమలు చేయలేదు. పంట నష్టపరిహారం ఇచ్చేలా సరికొత్త పంట బీమా పథకం తీసుకొస్తామని ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన్రు. మరి పంటల బీమా పథకం సోనియా గాంధీకి, రాహుల్ గాంధీకి, ప్రియాంక గాంధీకి ఎవరికి గిఫ్ట్ గా ఇచ్చిన్రు..? పంటల బీమా పథకం అమలు చేయకపోవడంతో తెలంగాణ రైతులు అరిగోస పడుతున్నరు.

ధరణి పోర్టల్ పెద్ద స్కాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల భూములు కబ్జా పెట్టి, కొన్ని సామాజిక వర్గాలకు, వారి అనుయాయులకు కట్టబెట్టేందుకు,... ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల పరం చేసేందుకు దరణి పోర్టల్ తీసుకొచ్చింది. నకిలీ విత్తనాల సరఫరా చేసేవారిపై పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతమని రేవంత్ రెడ్డి మాటలు చెప్పిన్రు. ఇప్పటివరకు ఏ ఒక్కరిపైనా అయినా చర్యలు తీసుకుని నియంత్రించిన్రా..? కాంగ్రెస్ ప్రభుత్వానికి నూతన వ్యవసాయ విధానం-పంటల ప్రణాళికపై ఎటువంటి అవగాహన లేదు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సంబంధించి నిర్దిష్ట ప్రణాళిక రూపొందించలేకపోవడం తెలంగాణ ప్రజల దురదృష్టం. కేవలం మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో కాలం వెల్లదీస్తూ 6 గ్యారంటీలను అమలు చేయకుండా తెలంగాణ రైతులను నిండా ముంచుతున్నరు. రైతులకు భూసార పరీక్షలు చేసి అనువైన పంటలు వేసుకునేలా గతంలో తెలంగాణకు రూ. 90 కోట్ల నిధులు సాయిల్ టెస్ట్ కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం విడుదల చేసింది.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో సాయిల్ టెస్ట్ నిధులు అటకెక్కినయ్. పంట నష్టపరిహారం అందించే ఫసల్ బీమా పథకాన్ని అటకెక్కించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడంలేదు. నకిలీ విత్తనాల మాఫియాను అరికట్టే పరిస్థితి లేదు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ప్రతి రైతుకు చేయూతనందించేలా నరేంద్ర మోదీ ప్రభుత్వం సంవత్సరానికి రూ. 6 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నది.


ఇవాళ తెలంగాణలో ఒక్క పంటకు బోనస్ ఇచ్చి మిగతా రెండు పంటలకు ఎగ్గొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. వడ్లతో సహా 7 పంటలకు మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం భరించి రైతులను ఆదుకుంటమని చెప్పి.. అధికారంలోకి వచ్చాక కేవలం సన్నవడ్లకే రూ. 500 బోనస్ ఇస్తమని మాట తప్పారు. అది కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా మోసం చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదు. వడ్లు ఆరబోసుకునే మార్కెట్ యార్డుల్లేవు.

రైతులు పండించిన పంటను జాతీయంగా, అంతర్జాతీయంగా ఎక్కడైనా అమ్ముకునేలా ఈ-నామ్ ఆన్ లైన్ మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి రైతు ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం నరేంద్ర మోదీ ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రంలో రైతు ఉత్పత్తులను అమ్ముకునేలా ఒక్కటంటే ఒక్క స్కీమునైనా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందా..? సమాధానం చెప్పాలి. కేంద్ర ప్రభుత్వం కోళ్ల పెంపకం, గొర్ల పెంపకం, చేపల పెంపకం కోసం లక్ష రూపాయల నుంచి రూ. 4 కోట్ల వరకు సబ్సిడీ లోన్లు ఇస్తోంది. కాని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నడ్డివిరుస్తున్నది. విత్తనాల నుంచి పంట చేతికొచ్చే వరకు నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పంటధాన్యాన్ని దళారుల పాల్జేస్తూ రైతులను మోసం చేస్తున్నది. కాంగ్రెస్ సర్కారు ఏ మొహం పెట్టుకుని రైతు విజయోత్సవాలు చేసుకుంటున్నట్లు..? కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజలకు న్యాయం చేయకపోగా వారి భూములు గుంజుకుంటూ దుర్మార్గ పాలన చేస్తున్నది. రైతు విజయోత్సవాలు చేసుకునే అర్హత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలకు గాను క్షమాపణ చెప్పి, రైతు విజయోత్సవాలు జరుపుకోవాలి.

# రూ.10 నాణేలు తీసుకోవట్లే

- ఆర్బీఐ నిబంధనలు పట్టని వ్యాపారులు..
- ఇబ్బందులు పడుతున్న కొనుగోలుదారులు
- తమిళనాడు, కేరళ, కర్నాటక, యూపీ తదితర రాష్ట్రాల్లో చెల్లుబాటు
- ఆర్బీఐ ఉత్తర్వులు బేఖాతర్

(వెంకటాచారి, ఢిల్లీ)



అన్ని వర్తక సముదాయాల్లో కొనుగోలు దారుల ఇచ్చే రూ. 10, రూ. 20 నాణేలు తీసుకోవాలని, లేకపోతే జైలుకి వెళ్ళాల్సి ఉంటుందని ఆర్బీఐ తాజా ప్రకటన జారీ చేసిన సంగతి విదితమే.. కానీ, దీనికి విరుద్ధంగా కొందరు వ్యాపారులు నాణేలను తిరస్కరిస్తున్నారు.

పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్నాటక, యూపీ తదితర రాష్ట్రాల్లో ఇవి చెల్లుబాటులో ఉన్నాయి. మన తెలుగు రాష్ట్రాల్లో ఎందుకు చెల్లుబాటు కావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. దేశం లోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు జీవనోపాధిని వెతుక్కుంటూ హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. అలా వచ్చినవారు ఆ రాష్ట్రాల్లో చెల్లుబాటవుతున్న రూ. 10, రూ. 20 నాణేలను కొనుగోలు నిమిత్తం ఇస్తుంటే ఇక్కడ తిరస్కరిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్బీఐ ఉత్తర్వుల మేరకు అన్ని షాపుల్లో ఇవి చెల్లేవిధంగా అధికారులు చర్యలు చేపట్టడంతో పాటు వ్యాపారులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

డిజిటల్ మనీ అందుబాటు లోకి వచ్చిన తర్వాత ఫోన్ పే, గూగుల్ పే, అమెజాన్ పే, భారత్‌పే, ఏటీఎం లకు అలవాటు పడి రూ. 10, రూ. 20 నాణేలు, కొంచెం చిరిగిన నోట్లను తిరస్కరిస్తున్నారు. డిజిటల్ పేమెంట్‌లు తెలియని వారు తమ వద్ద ఉన్న నాణేలను ఏమి చేయాలో తెలియని సందిగ్ధంలో ఉన్నారు. రూ. 10, రూ. 20 నాణేలు చెల్లుబాటు లోనే ఉన్నాయని, వాటిని తిరస్కరిస్తే ఐపీసీ సెక్షన్ 124 ప్రకారం ఫిర్యాదు చేయాలని, విచారణలో రుజువైతే మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆర్బీఐ ఉత్తర్వుల్లో పేర్కొంది..

# ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి శిక్ష పడకుండా కాపాడింది బీఆర్ఎస్

- పాఠశాలల్లో 51 మంది విద్యార్థులు చనిపోయిన్రు
- రాష్ట్ర వ్యాప్తంగా 886 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయిన్రు
- 38 గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు
- ప్రభుత్వ ఇంటెలిజెన్స్ ఎక్కడికి పోయింది?
- రైతులకు బేడీలేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది
- బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



హైదరాబాద్,మహానాడు:

కాంగ్రెస్ ఏలుబడిలో సంక్షేమ హాస్టళ్లన్నీ సంక్షోభ హాస్టళ్లుగా మారిపోయాయి. హోం, సోషల్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్, మున్సిపల్ .. ఇలా ముఖ్యమైన మంత్రిత్వ శాఖలన్నీ సీఎం రేవంత్ రెడ్డి దగ్గరే ఉంచుకున్నరు. పరిపాలన గాలికొదిలేసి మహారాష్ట్ర, ఢిల్లీ పర్యటనలతో టైం వెల్లదీస్తున్నరు. ఫుడ్ పాయిజన్ ఘటనలపై హైకోర్టు మొట్టికాయలు వేస్తే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ గురుకుల పాఠశాలల్లో 51 మంది విద్యార్థులు చనిపోయిన్రు. 23 మంది అభశుభం తెలియని విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డరు. 10 మంది అనుమానాస్పద స్థితిలో మరణించారు. నలుగురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో, 14 మంది అనారోగ్యంతో చనిపోయిన్రు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా 886 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయిన్రు. రాష్ట్రంలో 38 గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డికి సోనియా కుటుంబానికి ఊడిగం చేసుకోవడమే తప్పితే పేదప్రజల గురించి ఆలోచించే సోయి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయింది. ఇప్పటివరకు ముఖ్యమైన మంత్రిత్వ శాఖలన్నీ రేవంత్ రెడ్డి దగ్గరే ఉంచుకున్నరు. సంక్షేమ హాస్టళ్లలో ప్రతిపక్షాలు కుట్రచేసి పిల్లల్ని చంపేస్తున్నరంటూ మంత్రి సీతక్క మాట్లాడుతున్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల మీద నెపం నెట్టి రాజకీయ లబ్ధిపొందాలనుకోవడం సిగ్గుచేటు. పిల్లలు చనిపోయేంతవరకు వస్తుంటే ప్రభుత్వ ఇంటెలిజెన్స్ ఎక్కడికి పోయింది?

తెలంగాణ చరిత్రలో ఎన్నడు లేనంతగా సీఎం రేవంత్ సొంత జిల్లా నారాయణపేటలోని ఒక్క ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే మూడుసార్లు ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయి. ఫుడ్‌పాయిజన్ ఘటనలో సస్పెండైన నారాయణపేట డీఈవో మహ్మద్ అబ్దుల్ ఘనీకి ప్రభుత్వం వనపర్తి జిల్లా డీఈవోగా అదనపు పోస్టింగ్ ఇచ్చింది. తిరిగి ఒక్కరోజులోనే మళ్లీ నారాయణపేట డీఈవోగా బాధ్యతలు అప్పజెప్పింది. అవినీతి అధికారులకు వత్తాసు పలకడం వెనుక మతలబు ఏంటి..?

ఫుడ్ పాయిజన్ ఘటనలతో విద్యార్థులు అవస్థలు పడుతుంటే ఆకునూరి మురళి, కోదండరాం వంటి విద్యావేత్తలు ఎందుకు స్పందించడం లేదు..? కనీసం హాస్టళ్లను కూడా సందర్శించడం లేదు. సీఎం కేసీఆర్ మనవడు.. హిమాన్షుతో గచ్చిబౌలి కేశవనగర్‌లో ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్లు కూడా లేవని, సౌకర్యాలు లేవని దత్తత తీసుకుని కోటి రూపాయల నిధులిచ్చి, మొసలికన్నీరు కార్చిన్రు. ఆ ఒక్క స్కూల్ తప్పితే మిగతా స్కూళ్లలో సౌకర్యాలు కల్పించలేదు.

ఇప్పుడు కేసీఆర్ దారిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నడు. వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతిపై తామెందుకు కారణమంటూ రాష్ట్ర మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడిన్రు. రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థను గాలికొదిలేసి పాలనను ఆగం చేస్తున్నరు. మరోవైపు ట్విట్టర్ టిల్లు, డ్రామారావు, సైకోరావుగా పేరుతెచ్చుకున్న కేటీఆర్.. ఎప్పుడు ట్విట్టర్ లోనే స్పందిస్తున్నరు. కేవలం మీడియాలో హెడ్ లైన్ల కోసం బిజెపి-కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నయని అపరిపక్వతతో మాట్లాడుతున్నడు. కేటీఆర్ మాటలు చూస్తుంటే ఆయనకు మతిభ్రమించినట్లు కనపడుతోంది. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ డిపాజిట్లు కూడా కోల్పోవడంతో షాక్ నుంచి తేరుకోలేకపోయిండు. కాంగ్రెస్ - బీఆర్ఎస్ పార్టీల నాయకులు బయట దూప్ ఫైట్ చేస్తూ.. లోపల కలిసి వ్యాపారులు చేసుకుంటారు.

గతంలో కేసీఆర్.. ఆయన కుటుంబసభ్యులతో కలిసి జనపథ్ కు వెళ్లి సోనియా గాంధీ కాళ్లు పట్టుకున్నారు. కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయించి మంత్రి పదవులిచ్చిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ.... బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను తీసుకొని పదవులిస్తోంది. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలోకి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ లోకి వెళ్లడం కొత్త వ్యవహారమేమీ కాదు.

పాలనలో బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీలవి ఒకే తీరు. ఖమ్మంలో రైతులకు బేడీలేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బేడీలేసి జైలుకు పంపిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాదిరిగానే కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో నాసిరకం పురుగుల బియ్యం పెడుతూ విద్యార్థులను అనారోగ్యంపాల్జేస్తున్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ ప్రభుత్వం నిరుద్యోగులపై లాఠీచార్జీ చేసి, ఉస్మానియా యూనివర్సిటీని లాకౌట్ చేసి బంధిస్తున్నది. నిరుద్యోగులను అరెస్టులు చేస్తున్నది. అందుకు సజీవ సాక్ష్యం అశోక్ నగర్ వ్యవహారం. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి శిక్ష పడకుండా కాపాడింది బీఆర్ఎస్ పార్టీ. అందుకు బదులుగా కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ కుటుంబాన్ని రక్షిస్తున్నది. బీఆర్ఎస్ పాలనలో లక్షకోట్ల అవినీతి జరిగిందని ఢంకా బకాయించి చెప్పి, అవినీతి సొమ్ము కక్కిస్తానని రేవంత్ రెడ్డి మాటలు చెప్పిండు. ఏడాది పాలనలో ఇంతవరకు దోషులెవ్వరినీ జైలుకు పంపించలేదు.

కేటీఆర్..!! 2004లో బీఆర్ఎస్-కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. బహుశా అప్పుడు నువ్వు అమెరికాలో ఉన్నవేమో. అందుకే నీకు తెల్వదేమో..!! చరిత్ర తెలుసుకోవాలి. రాష్ట్రపతి ఎన్నికల్లో ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్ము గారిని రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెడితే కాంగ్రెస్-బీఆర్ఎస్ లు కలిసి వ్యతిరేకిస్తూ ప్రచారం చేశాయి. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన రాష్ట్రపతి అభ్యర్థికి యశ్వంత్ సిన్హాకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ ప్రచారం చేసింది. నాడు ఆర్టికల్ 370 రద్దుని కాంగ్రెస్ వ్యతిరేకిస్తే.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కశ్మీర్ ప్రత్యేక దేశమంటూ ప్రకటించింది. కాంగ్రెస్-బీఆర్ఎస్ పాలన, విధివిధానాలు ఒక్కటే. దేశహితాన్ని కాంక్షించకుండా సర్జికల్ స్ట్రయిక్ పై సాక్షాలడిగింది కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం స్వచ్ఛమైన, సుపరిపాలన అందిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ధరణి పోర్టల్, టీఎస్ పీఎస్సీ నియామకాల్లో అవినీతికి పాల్పడింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా, మూసీ, పాలమూరు-రంగారెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టు అంచనాల పెంపు, ధాన్యం కొనుగోళ్లలో అవినీతికి తెరలేపింది. కాంగ్రెస్ పార్టీ చేతిలో కమలం లేదు.. బీఆర్ఎస్ కారు స్టీరింగ్ కాంగ్రెస్ పార్టీ చేతిలో ఉంది. కేటీఆర్ ఇప్పటికైనా ఇష్టానుసారంగా కూతలు మానుకోవాలి. లేదంటే ప్రజల్లో కేఏ పాల్ మాదిరిగా కామెడీ పీస్ గా మిగిలిపోకతప్పదు. మీడియా సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ గారు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ గారు, తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 29, నవంబర్ 2024 ||

# పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం

◆ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ,మహానాడు:
భారత ప్రథమ సామాజికతత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడు మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా కాకాని నగర్ కార్యాలయంలో స్థానిక నేతలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ క్రమంలో మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సమ సమాజ స్థాపనకు, బడుగ, బలహీన వర్గాలకు విద్యను అందిస్తూ అన్నిట్లో సమాన హక్కుల కోసం పోరాడిన పూలే ఆశయ సాధనలో అందరం నడుద్దామన్నారు.



## భారీ విస్తరణపై 'బన్యన్ నేషన్'
# రూ.200 కోట్ల వ్యయం

◆ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,మహానాడు:
ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ పరిశ్రమతో సర్క్యులర్ ఎకానమీ (వృత్తాకార ఆర్థిక వ్యవస్థ)కి తోడ్పడుతున్న అంకుర సంస్థ 'బన్యన్ నేషన్' రూ.200 కోట్ల పెట్టుబడితో భారీ విస్తరణ చేపట్టేందుకు ముందుకొచ్చిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం నాడు సంస్థ ప్రతినిధులు సచివాలయంలో తనను కలిసిన అనంతరం ఆయన వివరాలు తెలిపారు.

ప్రస్తుతం పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో 15 వేల టన్నుల వార్షిక సామర్థ్యంతో 'బన్యన్ నేషన్' రీ సైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తోంది. దీనిని 45 వేల టన్నులకు విస్తరించడానికి ఏర్పాట్లు చేసుకుంటోందని ఆయన చెప్పారు. విస్తరణ పూర్తయితే మరో 500 మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు.

రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ ను ఈ సంస్థ యూనిలివర్, టాటా మోటార్స్ లాంటి పెద్ద కంపెనీలకు విక్రయిస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. రూ.100 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న 'బన్యన్ నేషన్' లాభాల్లో నడుస్తోందని చెప్పారు. కొత్త ప్లాంట్ల ఏర్పాటు కోసం వారు మరికొంత భూమిని అడుగుతున్నారని, దీనిపై టీజీఐఐసీ నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఐటీ సలహాదారు సాయికృష్ణ, టీజీఐఐసీ సిఇఓ వి. మధుసూదన్, బన్యన్ నేషన్ సిఇఓ మణి వాజిపేయ్, సిఓఓ రాజ్ కిరణ్ మదనగోపాల్ లు పాల్గొన్నారు.

# తిరుమలలో ఎన్నో మార్పులు

◆ మఠాలు వ్యాపారాత్మక ధోరణిలో ఉంటే చూస్తూ ఊరుకోబోమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హెచ్చరిక

తిరుమల,మహానాడు:
కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుమలలో ఎన్నో మార్పులు వచ్చాయని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. గతంలో సామాన్య భక్తులకు అనేక ఇబ్బందులు ఉండేవని... ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పిస్తున్నామని చెప్పారు.



గతంలో తిరుమలలో ఎన్నో వివాదాలు ఉండేవని... ఇప్పుడు ఎలాంటి వివాదాలు లేకుండా టీటీడీ పాలన కొనసాగుతోందని ఆనం తెలిపారు. ప్రతి నెల తిరుమలకు వచ్చి భక్తుల సౌకర్యాలు మెరుగుపడ్డాయా? లేదా? అనేది పరిశీలిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలోని 5,400 ఆలయాలకు ధూప దీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తాన్ని రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచామని తెలిపారు. మఠాలు వ్యాపారాత్మక ధోరణిలో ఉంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని చెప్పారు.

## అయ్యప్ప భక్తుడైన
# ఆర్టీసీ డ్రైవర్‌కు అవమానం

◆ నాగరాజుకు ఆర్టీసీ అధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్
◆ మండిపడ్డ అయ్యప్ప స్వామి భక్తి మండలి
◆ అయ్యప్ప స్వాములకు ఆర్టీసీ డిపో మేనేజర్ క్షమాపణలు

తొర్రూరు,మహానాడు:
మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో ఆర్టీసీ డిపోలో ఓ వివాదాస్పద ఘటన చోటుచేసుకుంది. అయ్యప్ప మాల ధరించి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజుకు ఆర్టీసీ అధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయడం భక్తుల ఆగ్రహానికి దారితీసింది. ప్రతిరోజు లాగా డ్రైవర్లందరికీ నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో భాగంగా నాగరాజుపై కూడా పరీక్షలు చేపట్టారు. అయితే, తాను అయ్యప్ప మాల ధరిం చానని, తనపై ఈ పరీక్ష చేయవద్దని నాగరాజు కోరిన ప్పటికీ అధికారులు పట్టించుకోలేదని సమాచారం.

ఈ విషయంపై మండిపడ్డ అయ్యప్ప స్వామి భక్తి మండలి సభ్యులు ఆర్టీసీ డిపో ముందు నిరసన వ్యక్తం చేశారు. అధికారులు తీసుకున్న చర్యలు అయ్యప్ప భక్తుల ఆచారాలకు విరుద్ధమని, ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదంపై స్పందించిన ఆర్టీసీ డిపో మేనేజర్ అయ్యప్ప స్వాములకు క్షమాపణలు చెప్పారు. ఈ ఘటన అనంతరం ఆర్టీసీ అధికారులు డిపోలో ఉన్న ఉద్యోగుల ఆచారాలను గౌరవిస్తామని హామీ ఇచ్చారు.

# కేటీఆర్ వ్యాఖ్యలు ఖండించిన ఐపీఎస్ సంఘం

◆ రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌కు బాసట
◆ కలెక్టర్‌ను సన్నాసి అంటూ కేటీఆర్ విమర్శ
◆ మావాళ్లను పార్టీ మారమంటున్నారని ఆరోపణ
◆ కేటీఆర్ వ్యాఖ్యలు సరికావన్న ఐపీఎస్ సంఘం



హైదరాబాద్,మహానాడు:
రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం ఖండించింది. నిరాధార ఆరోపణలు సరికాదు. ఇలాంటివి చెడు ప్రభావం చూపుతాయి. కేటీఆర్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం, ప్రజాస్వామ్యానికి హానికరమని వెల్లడిం చింది. ఈ విషయంలో తాము కలెక్టర్‌కు అండగా ఉంటామని ఐపీఎస్ అధికారుల సంఘం తెలిపింది. కాగా సిరిసిల్లలో ఇటీవల నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్.. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కాంగ్రెస్ కార్యకర్తలా పని చేస్తున్నారు. తమ పార్టీ నాయకులను పార్టీ మారాలని అడుగుతున్నాడు. ఇలాంటి సన్నాసిని కలెక్టర్‌గా తీసుకొచ్చా రు. అతి చేస్తున్న కలెక్టర్లు, అధికారులు రాసి పెట్టుకోవాలి. కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తే మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో చెల్లిస్తామని హెచ్చరించారు.

# శ్రీలంకను తలపిస్తున్న తెలంగాణ

◆ ఇది ప్రజాపాలన కాదు రాక్షస పాలన
◆ ఎక్కడ చూసినా కాంగ్రెస్ కండకావరం
◆ కూల్చివేతలు,కాల్చివేతలు,పేల్చివేతలు
◆ కేసీఆర్ హయాంలో పాడిపంటలు
◆ రేవంత్ రెడ్డి వచ్చాక అగ్నిమంటలు
◆ సీఎం సోదరులది అంతులేని అవినీతి
◆ రేవంత్ సోదరులు భూకబ్జా కోరులు
◆ నిన్న లగచర్ల.. నేడు దిలావర్ పూర్
◆ రైతులతో పెట్టుకున్నోళ్లెవరూ బాగుపడలేదు
◆ చిట్టినాయుడికీ చంద్రబాబుకు పట్టిన గతే
◆ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి



నిజామాబాద్,మహానాడు:
తెలంగాణలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ కాంద కావరమే. అక్రమ అరెస్టులు, లాఠీ దెబ్బలు, కూల్చి వేతలు, కాల్చివేతలు, పేల్చివేతలు-ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే? అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్న గారి జీవన్ రెడ్డి ప్రశ్నించారు. నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది ప్రజాపాలన కాదు రాక్షస పాలన అని మండిపడ్డారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఏ ముహూర్తంలో వచ్చారో గానీ ఆయన పాదం తెలంగాణకు ప్రమాదంగా పరిణమించిందన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ భూములు పాడిపంటలతో విలసిల్లితే రేవంత్ రెడ్డి వచ్చాక అగ్నిమంటలతో కాలిపోతూ కనిపిస్తున్నాయన్నారు. సీఎం సోదరులది అంతులేని అవినీతి అని, చిట్టినాయుడి దుర్నీతికి తెలంగాణ ఆహుతి అవుతోందని ఆయన విరుచుకుపడ్డారు.

"రేవంత్ సోదరులు భూకబ్జా కోరులు. వారిభూదోపీడీకి అధికారులు వంత పాడుతున్నారు. పల్లెల్లో అధికారుల దురంహకారం పెరుగుతుండగా సర్కారుపై రైతులు ధిక్కార స్వరం వినిపిస్తున్నారు.

నిన్న లగచర్ల.. నేడు దిలావర్ పూర్ వరకూ గ్రామం ఏదైనా కాంగ్రెస్ సర్కారుపై ప్రజల సంగ్రామమే కనిపిస్తోంది. నిత్యం ప్రజల తిరుగుబాటుతో తెలంగాణ శ్రీలంకను తలపిస్తున్నది. రైతులతో పెట్టుకున్నోళ్లెవరూ బాగుపడలేదు. బషీర్‌బాగ్‌లో రైతులను చంపించిన చంద్రబాబు నాయుడు తట్టా బుట్ట సర్దుకొని పోయిండు. చిట్టినాయుడికీ చంద్రబాబు కు పట్టిన గతే పడుతుంది.

సీఎంగా రేవంత్ రెడ్డి పాలనలో విఫలం కాగా అవినీతి, అరాచకాల్లో సఫల మవుతున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు సర్వనాశనం కావడం తెలంగాణ ప్రజలకు మరణశాసనంగా మారింది. హెూమ్ శాఖ మంత్రి కూడా రేవంత్ ,శాంతిభద్రతలు గల్లంతు. రేవంత్ వద్దే విద్యా రంగం

గురుకులాలలో మరణ మృదంగం. 11నెలల్లో 48మంది విద్యార్థులు మృత్యువాత పడ్డారు. నిన్న శైలజ అనే విద్యార్థిని మరణిస్తే ఆమె గ్రామానికి ఎవరూ వెళ్లకుండా నిర్బంధం అమలు చేశారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మిని నిర్బంధించారు. కాంగ్రెస్ నికృష్ట పాలనలో ఏ ఒక్కరైనా సంతోషంగా ఉన్నారా?.

చివరకు నీ అవసరానికి ఒట్లు పెట్టిన కొండగట్టు అంజన్న నుంచి భద్రాద్రి రామయ్య దాకా, సిద్దులగుట్ట శివయ్య నుంచి యాదగిరి గుట్ట నరసన్న దాకా, బాసర నుంచి కీసర దాకా ,దేవుళ్లకే శఠగోపం పెట్టిన ఘనుడు రేవంత్ రెడ్డి అని జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ అవినీతికి అంతు లేకుండాపోయింది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బంధుగణం అవినీతి కి జిల్లా బలవుతోంది. ఆ పార్టీ నాయకులు ఈరావత్రి అనిల్ ఇసుక దందాలో, సుదర్శన్ రెడ్డి అనేక జిల్లాల్లో లిక్కర్ వ్యాపారంలో మునిగితేలుతున్నారు. ఆర్మూర్‌లో కాంగ్రెస్ నాయకుడు వినయ్ రెడ్డి అవినీతికి పాల్పడుతూ ప్రజలను దోచుకుంటున్నాడు. కాగా 'దీక్షా దివస్' స్ఫూర్తితో రేవంత్ సర్కారుపై సమరభేరి మోగిస్తామన్నారు. నేటి దీక్షా దివస్ ను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ లోని తెలంగాణ భవన్ లోనే దీక్షాదివస్ కార్యక్రమం జరుగుతుందని జీవన్ రెడ్డి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జడ్పి ఛైర్మన్ విఠల్ రావు,బోధన్ నియోజకవర్గ ఇంఛార్జ్ ఆయేషా ఫాతిమా షకీల్,సీనియర్ నాయకులు రాంకిషన్ రావు,సుజీత్ సింగ్ ఠాకూర్, ప్రభాకర్,సత్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్రం అభివృద్ధి

◆ మాస్టర్ ప్లాన్‌కు అవసరమయ్యే నివేదికలు ఇవ్వండి
◆ జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల,మహానాడు:
తిరుమల క్షేత్ర తరహాలోనే శ్రీశైల మహా క్షేత్రాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు సమగ్ర వివరాలతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, శ్రీశైలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, ఆత్మకూరు డిఎఫ్ఓ సాయిబాబా, ఆత్మకూరు ఆర్డీఓ నాగ జ్యోతి, సర్వే ల్యాండ్ ఏడి జయరాజు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకరంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో శ్రీశైలం మహా క్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించి నివేదికలు పంపాలని గత సోమవారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన దేవాదాయ, పర్యాటక, ఆర్ అండ్ బీ మంత్రుల కమిటీ సమావేశంలో నిర్దేశించారన్నారు. ఈ మేరకు జిల్లాలో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధికి సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు అవసరమయ్యే నివేదికలను శుక్రవారం సాయంత్రంలోగా అందజేయాలని దేవాదాయ, అటవీ, సర్వే అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాబోయే రెండు సంవత్సరాలలో శ్రీశైలం క్షేత్రాన్ని తిరుమల క్షేత్ర తరహాలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో నివేదికలు తయారు చేసి ఇస్తే మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. గతంలో దేవాదాయ, అటవీ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే నివేదికలను కూడా పొందుపరచాలని సర్వే అండ్ ల్యాండ్స్ ఏడి ఆదేశించారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన అటవీ విస్తీర్ణం, అటవీ సరిహద్దుల సర్వే, గజిట్ నోటిఫికేషన్, నందికొట్కూరు రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణుల నిషేధిత భూములు సంబంధిత వివరాలతో నివేదికలు అందజేయాలని డిఎఫ్ఓ ను కలెక్టర్ ఆదేశించారు. శ్రీశైల దేవస్థానం ఆధీనంలో ఉన్న భూములు, అటవీ సరిహద్దుల నుండి రక్షణ గోడలు, తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి సంబంధించిన నివేదికలను అందజేయాలని శ్రీశైలం దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్‌ను కలెక్టర్ ఆదేశించారు. శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి గతంలో మంత్రుల కమిటీ సూచించిన అంశాలు, తయారు చేసిన నివేదికలను కూడా అందచేయాలన్నారు. సున్నిపెంట నుండి శ్రీశైలం వరకు 2.5 కిలోమీటర్ల ఐకానిక్ బ్రిడ్జి ఏర్పాటు ప్రతిపాదనలు, రహదారి విస్తరణ సంబంధించిన పనులు కూడా మాస్టర్ ప్లాన్ నివేదికలో పొందుపరుస్తామని కలెక్టర్ తెలిపారు.







# తెలంగాణ యోద్ధ కేసీఆర్

◆ రాష్ట్రం కోసం చావుతో యుద్ధం చేసిన పోరాటయోధుడు
◆ మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్
◆ తెలంగాణలో దీక్షాదివస్ ఏర్పాట్లు పరిశీలించిన కేటీఆర్

హైదరాబాద్,మహానాడు: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసేందుకు సిద్దపడ్డ గొప్ప నాయకుడు కేసీఆర్ అని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం దీక్షా దివస్ సందర్బంగా తెలంగాణ భవన్ లో నిర్వహించే కార్యక్రమం ఏర్పాట్లను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, దీక్ష దివస్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జి ఇంచార్జి పొన్నాల లక్ష్మయ్య, సికింద్రాబాద్, అంబర్ పేట, ముషీరాబాద్ ఎమ్మెల్యే లు పద్మా రావు గౌడ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాజీమంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, నాంపల్లి, ఖైరతాబాద్ నియోజకవర్గాల ఇంచార్జి లు ఆనంద్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు.

ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్బంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అద్యక్షులు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష తెలంగాణా ఉద్యమాన్ని కీలకమలుపు తిప్పిందని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలోని అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ రాష్ట్రం రావాలి... తెలంగాణ రాష్ట్రం కావాలని నినదించడం జరిగిందని వివరించారు.

అటువంటి దీక్షా దివస్ ను అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని అన్ని నియోజకవర్గాల నుండి బైక్ ల పై ర్యాలీగా బసవ తారకం హాస్పిటల్ సర్కిల్ వరకు చేరుకుంటారని, అక్కడి నుండి పాదయాత్రగా తెలంగాణ భవన్ కు చేరుకోనున్నట్లు చెప్పారు.

తెలంగాణ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, కేసీఆర్ ఉద్యమ నేపథ్యాన్ని వివరించేలా ప్రత్యేకంగా రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించడం జరుగుతుందని, అనంతరం సభ నిర్వహిం చడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.





జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 29, నవంబర్ 2024


## రామ్మూర్తి నాయుడికి ఘన నివాళులు

◆ **అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఎమ్మెల్యే యరపతినేని**

**చిత్తూరు, మహానాడు:** చిత్తూరు జిల్లా, నారావారిపల్లెలో గురువారం జరిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ శాసన సభ్యుడు నారా రామ్మూర్తి నాయుడు కర్మ క్రియల్లో పాల్గొని, నారా రామ్మూర్తి నాయుడి చిత్ర పటానికి పూలు సమర్పించిన గురజాల శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు నివాళులు అర్పించారు.



ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో యరపతినేని నారా రామ్మూర్తి నాయుడుతో ఉన్న అనుబంధాన్ని, మిత్రత్వాన్ని గుర్తు చేసుకున్నారు. 1994లో నారా



రామ్మూర్తి నాయుడు, యరపతినేని శ్రీనివాసరావు శాసన సభ్యులుగా ఎన్నికై, ఆ కాలంలో వారిద్దరి మధ్య ఏర్పడిన సన్నిహిత సంబంధం రాజకీయ రంగంలో ఒక ప్రత్యేక గుర్తింపుగా నిలిచిందని గుర్తు చేశారు. తమ రాజకీయ ప్రస్థానంలో వారు అనేక అనుభవాలను పంచుకొని, ప్రజాసేవలోని అనుభవాలను చంద్రబాబుతో స్మరించుకున్నారు.



**నారావారిపల్లెలో నారా రామ్మూర్తి నాయుడు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని వారికి నివాళులు అర్పించిన ఆయన సోదరుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, కుటుంబ సభ్యులు, బంధువులు, పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యుడు భాష్యం ప్రవీణ్, దర్శి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, యువ నేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దంపతులు**





























**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం ఢిల్లీలో కూటమి ఎంపీలకు విందు ఏర్పాటు చేశారు. ఏపీకి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ ఎంపీలతోపాటు తెలంగాణ బీజేపీ ఎంపీలు హాజరయ్యారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, గిరిరాజ్ కిషోర్, అనురాగ్ ఠాకూర్, రాజీవ్ ప్రతాప్ రూఢీ హాజరయ్యారు**

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

06

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 29, నవంబర్ 2024 ||

## 'జనవాణి'కి వినతుల వెల్లువ

- అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే శ్రీనివాసులు

**మంగళగిరి, మహానాడు:** ఇక్కడి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. వినతులను స్వీకరించడమే కాకుండా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆ సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. నేడు కూడా జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షులు రాజారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన, న్యాయవాది గాలి శ్రీనివాసులు, నైనార్ శ్రీనివాస్, రాయల వంశీ, బాబ్జీ, సునీల్ చక్రవర్తి, సాని శ్రీనివాస్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.









## వారసత్వంగా వచ్చిన భూమి వైసీపీ నేతలు కబ్జా!

- భూ సమస్యలతో పాటు, మోసాలపై నేతలకు బాధితుల ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నేతలు
- సమస్యలు విని పరిష్కారానికి కృషి చేసిన నేతలు

**మంగళగిరి, మహానాడు:**

వివిధ సమస్యల పరిష్కారానికి పలువురు బాధితులు ఇక్కడి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు. వారి నుండి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బిల్డింగ్స్ అండ్ కన్స్ట్రక్షన్ సలహా కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు లు అర్జీలు స్వీకరించారు. అధికారులు, సంబంధిత నేతలతో ఫోన్లలో మాట్లాడి అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

- కడప జిల్లా, కాశినాయన మండలం కేవన్ కోటాల గ్రామానికి చెందిన ఓర్సు కిరణ్ కుమార్, ఓర్సు బాల య్యలు విజ్ఞప్తి చేస్తూ.. తమకు వారసత్వంగా వచ్చిన భూమిని కబ్జా చేసి వైసీపీ నేతలు కొట్టేసేందుకు కుట్ర చేస్తున్నారని.. అన్ లైన్ రికార్డులు మార్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని.. వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.
- గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, మందడం గ్రామానికి చెందిన వాకచర్ల వీరయ్య విజ్ఞప్తి చేస్తూ.. వైకుంఠపురంలోని 22ఏ జాబితాలో ఉన్న తమ పొలానికి ఎన్వోసీ ఇప్పిస్తాని చెప్పి తమ వద్ద రూ. 50 లక్షలు తీసుకొని వడ్లమూడి గ్రామానికి చెందిన చుంచు సుధీర్ తమను మోసం చేశారని.. అతనిపై చర్యలు తీసుకుని డబ్బులు ఇప్పించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



- ప్రకాశం జిల్లా, పెద్ద దోర్నాల మండలానికి చెందిన ఏపీ రామారావు విజ్ఞప్తి చేస్తూ.. 2018 –2019 లో మండలంలోని పలు చెంచుగూడెలలో అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టానని దానికి సంబం ధించిన బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నానని.. దయచేసి తనకు రావాల్సిన బిల్లులు ఇప్పించి ఆదు కోవాలని విన్నవించుకొన్నారు.
- గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, నవులూరు గ్రామానికి చెందిన జయలక్ష్మి అనే మహిళ విజ్ఞప్తి చేస్తూ.. తన తండ్రి ఆస్తిపై కన్నేసి.. తన తల్లి బతికి ఉండగానే మరో మహిళ తన తండ్రికి భార్యగా దొంగ పత్రాలు సృష్టించుకొని తమ ఆస్తిని వేరొకరికి అమ్మారని.. కొన్న వారు మా ఆస్తిని బ్యాంకులో తనకా పెట్టి డబ్బులు తెచ్చుకున్నారని.. ఈ అక్రమానికి సహకరించిన అధికారులు, తన తండ్రి ఆస్తులను కొట్టేయాలని చూసిన కుట్రదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేశారు.
- అన్నమయ్య జిల్లా, సీతానగరం మండలం మరిపివలస గ్రామానికి చెందిన దివ్య ప్రసాద్ రాగికోన వలసా, కమ్మల గూడెంలలో నివసించే ఆదివాసీల జీవనోపాధికి ప్రభుత్వం భూమిని కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.
- ప్రకాశం జిల్లా దర్శి మండలం పెద్ద ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన రావి వెంకటాద్రి విజ్ఞప్తి చేస్తూ.. తమ పొలానికి నీరు రాకుండా పంట కాలువను పూడ్చి వేసి తమను ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకొని పంటకాలువకు నీరు వచ్చేలా చూడాలని కోరారు.
- కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామా నికి చెందిన షేక్ బాజీ షరీఫ్ విజ్ఞప్తి చేస్తూ.. రోడ్డు మీదకు తడిక కట్టిప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేం దుకు షేక్ పెద నాగూర్ అనే వ్యక్తి యత్నించగా దాన్ని ప్రశ్నిస్తే తనపై హత్యాయత్నానికి యత్నించారని.. అత నిపై చర్యలు తీసుకోవాలని నేతలకు ఫిర్యాదు చేశారు.



## మహిళల విద్యకోసం పాటుపడిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే

- టీడీపీ నేతలు

**మంగళగిరి, మహానాడు:**

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక సంఘ సంస్కర్త, రచయిత, విద్యావేత్త జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఇక్కడి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కులవ్యవస్థను, జాతి వివక్షను, స్త్రీ అణచివేతను ఖండించి సమాజంలో సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, మహిళల విద్యకోసం పాటు బడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

సమాజ శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శమూర్తి అని ప్రశంసించారు. ఇటువంటి మహనీయుడిని నేటి యువత అదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి పాటు బడి.. సమాజంలో వివక్షను రూపుమాపాలని నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, టీటీడీ సభ్యుడు జంగా కృష్ణమూర్తి, ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజరి కమిటీ చైర్మన్ గొట్టుముక్కుల రఘురామరాజు, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, టీడీపీ కార్యాలయ రిసెప్షన్ ఇన్చార్జ్ హాజీ హసన్ బాషా, పీరయ్య, తిరువీధుల బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.




అఖిల భారత కాకతీయ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు లెక్కల హరికృష్ణను, ఐజేయు నేషనల్ కౌన్సిల్ మెంబర్ అయ్యన్న గారి శ్రీనివాస్‌ని రిటైర్డ్ ఐఆర్ఎస్ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ నరసింహప్ప ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం అఖిలభారత కాకతీయ ఉద్యోగ సంఘ సమావేశంలో జరిగింది.

## పులివెందుల రెడ్డిగారా? మజాకానా?

- తిరుమలపై అవినాష్‌రెడ్డి అనుచరుడు వంశీధర్‌రెడ్డి ఫొటో షూట్

**తిరుపతి, మహానాడు:** తిరుమల శ్రీవారి ఆలయం ముందు వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరుడు వంశీధర్ రెడ్డి హల్ చల్ చేశారు. నలుగురు వ్యక్తిగత ఫోటోగ్రాఫర్లతో ఆలయ ప్రాంగణంలో ఫొటోషూట్ నిర్వహించారు. ఇంత జరుగుతున్నా టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పట్టించుకోలేదు.



వంశీధర్ రెడ్డి హంగామా పై భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

మరోవైపు ఆయన వ్యక్తిగత సిబ్బంది మీడియాపై దురుసుగా ప్రవర్తించారు. గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడిన వైసీపీ నేతలపై టీటీడీ విజిలెన్స్, పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో మాత్రం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## గొప్ప జీవనశైలితోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఆరోగ్య భారతి జాతీయ సహా సంఘటన కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ

**గుంటూరు, మహానాడు:** ఎనభై శాతం రోగాలు జీవనశైలి రోగాలని, శ్రమకు మించి తినడం, అవసరానికి మించి కూడా పెట్టడం మంచిది కాదని ఆరోగ్య భారతి జాతీయ సహా సంఘటన కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా రాబోయే తరాలకు ఆరోగ్య మార్గదర్శకులు కావాలి... అలా ప్రచారం చేయాలని కోరారు. స్థానిక అమరావతి రోడ్డు, హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్మెంట్ ఆవరణ ప్రాంగణంలోని సుధర్మ హాల్లో గురువారం ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ధన్వంతరి హెూమం, ధన్వంతరి జయంతి సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మురళీకృష్ణ ముఖ్యవక్తగా పాల్గొని, మాట్లాడారు.

సమతుల్య ఆహారం, వ్యాయామం, జీవనశైలిలో మార్పు వల్ల ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని సభకు అధ్యక్షత వహించిన సేవా భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కెఎస్ఎన్ చారి అన్నారు. డాక్టర్ ఎస్.రఘు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమన్నారు. డాక్టర్ వై.సుబ్బ రాయుడు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం సమగ్ర వైద్యం అని.. మనం చేస్తున్న ఇప్పటి వైద్యం ఉపశమనానికి మాత్రమే అని తెలిపారు.

డాక్టర్ ఎం.డి.వి రమణ మాట్లాడుతూ సంస్కృత భాషను, సంస్కృతిని బ్రిటిష్ వాళ్ళు దూరం చేశారని... విజ్ఞానం పెరిగింది.. అదే సమయంలో జ్ఞానం పోయింద అన్నారు. డాక్టర్




డి.సత్యబాబు మాట్లాడుతూ త్రిదోషాలు, సప్త ధాతువులు మన ఔషధాల వల్ల నయమవుతాయని తెలిపారు. హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ, కాలేజీ కమిటీ కరస్పాండెంట్ కం సెక్రటరీ చెరువు రామకృష్ణ మూర్తి, ఆరోగ్య భారతి గుంటూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శంకర్ రెడ్డి, ఆరోగ్య భారతి రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రాండ్ కేనియన్ తరహాలో గండికోట అభివృద్ధి

- కేంద్ర టూరిజం శాఖకు లేఖ
- రూ.77.91 కోట్లను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి




**గుంటూరు, మహానాడు:** అమెరికాలోని గ్రాండ్ క్యానియన్ తరహాలో భారతదేశంలోని గండికోటను అభివృద్ధి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం కూడా సహకరిస్తుండటం ఆనందంగా ఉందని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఢిల్లీలోని సమాచార భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లా డుతూ గండికోట అభివృద్ధికి రూ.77.91 కోట్ల నిధులను కేటాయించినందుకు కేంద్ర మంత్రిత్వ శాఖకు అయిన ధన్యవాదాలు తెలిపారు.

చరిత్రాత్మక గండికోట వైభవాన్ని పునరుద్ధరిస్తూ, ఆ కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే దృక్పథంతో గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తీసుకున్న చొరవ ఫలించింది. పెమ్మసాని ప్రయత్నానికి స్పందిస్తూ గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రూ.77.91 కోట్లను గురువారం మంజూరు చేసింది. గండికోట ప్రాభవం, ప్రాశస్త్యం భవిష్యత్ తరాలకు కూడా తెలియజేసేలా అభివృద్ధి చేయించేందుకు పెమ్మసాని నడుం బిగించారు. అందుకు నిధులను మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు ఈ నెల నాలుగో తేదీన లేఖ రాశారు. అనంతరం కేంద్ర మంత్రిత్వ శాఖతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ నిధుల మంజూరుకు కృషి చేశారు.

ఈ క్రమంలో స్పందించిన కేంద్ర మంత్రిత్వ శాఖ రాష్ట్రంలో పలు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని తీసుకున్న నిర్ణయాలలో గండికోటకు కూడా ప్రముఖ స్థానం కల్పించింది. అందులో భాగంగా గండికోట అభివృద్ధితో పాటు పరిసర నదీ పరివాహక ప్రాంతాన్ని కూడా పర్యాటకంగా అందుబాటులోకి తెచ్చేందుకు నిధులను కేటాయించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ స్పందనకు పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు.



## తొలి సామాజిక తత్వవేత్త పూలే..

- జడ్పీ చైర్మన్ క్రిష్టీనా

**గుంటూరు, మహానాడు:**

మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గుంటూరు హిందూ కాలేజీ సమీపంలోని సిగ్నల్స్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెరహెని క్రిస్టినా ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణచివేతకుగురైన బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడిన ధీరుడు పూలే అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు మహమ్మద్ నజీర్ అహ్మద్, గళ్ళా మాధవి, ఎమ్మెల్సీలు కేవస్ లక్ష్మణరావు, యేసు రత్నం పాల్గొన్నారు.

## క్లీన్ నరసరావుపేట లక్ష్యం!

- ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, మహానాడు:**

పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అడుగులు వేస్తున్నారు. వార్డు వార్డునా సిబ్బందిని, కార్యకర్తల్ని వెంటబెట్టుకుని తిరుగుతూ స్పెషల్ శానిటేషన్



డ్రైవ్ నిర్వహించారు. ఒకటో వార్డుల్లో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. కాలువల సమీపంలో పెరిగిన పిచ్చి మొక్కల్ని కట్టర్లతో తొలగించారు. దోమల కారణంగానే వ్యాధుల వ్యాప్తి తీవ్రమవుతోందని, దోమలు పెరిగే ప్రాంతాలన్నింటినీ ఫాగింగ్, డీ వార్మింగ్ చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ఎక్కడా చెత్తా చెదారం రూడ్ల పై వేయకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలంటే అది కేవలం వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో మాత్రమే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ శాసన మండలి విప్‌గా నియామకమైన డాక్టర్ వేపాడ చిరంజీవి రావు, ఆయన సతీమణి వి.నివేదిత తిరుమల మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని తొలిసారిగా సందర్శించారు. అన్నదానం చేసి, అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాన ప్రసాద నాణ్యత మెరుగుదలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా తిరుపతి నందు జ్యోతిబాపూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించిన ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖామాత్యులు ఎస్. సవిత



జనం గుండె చప్పుడు
మహానాడు
07
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 29, నవంబర్ 2024 ||

# మరువలేను.. బుర్రిపాలెం మమతనురాగాలు!

◆ హీరో గల్లా అశోక్



**గుంటూరు, మహానాడు:** తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి ఎప్పుడో చిన్నతనంలో బుర్రిపాలెం గ్రామానికి వచ్చానని చాలా కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు గ్రామానికి రావడం చాలా సంతోషంగా ఉందని హీరో గల్లా అశోక్ తెలిపారు. అశోక్ హీరోగా నటించిన దేవకి నందన వాసుదేవ సినిమా ఇటీవల విడుదలైన సందర్భంగా గ్రామస్తులు ఆహ్వానం మేరకు గురువారం ఆయన బుర్రిపాలెం విచ్చేశారు. ఈ సందర్భంగా అశోక్‌కు బుర్రిపాలెం వాసులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో సాయిబాబా ఆలయాన్ని సందర్శించి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన తాత సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గల్లా అశోక్ మాట్లాడుతూ ఇక్కడ ఎంతో ఆప్యాయంగా అందరూ స్వాగతం పలికారని ఇకముందు రెగ్యులర్‌గా ఇక్కడకు వస్తుంటానని చెప్పారు. తన మూడో చిత్రం సితార ప్రొడక్షన్స్ బ్యానర్‌లో రాబోతుందని ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ పూర్తయిందని అశోక్ తెలిపారు.

# విజయ్‌పాల్‌ను కస్టడీకి ఇవ్వాలి

## కోర్టులో పోలీసుల పిటిషన్

**గుంటూరు, మహానాడు:** విజయ్‌పాల్‌పై పోలీసుల కస్టడీ పిటిషన్ వేశారు. ఐదురోజుల పాటు విచారణ నిమిత్తం కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో విజయ్‌పాల్ అరెస్టు అయి, ప్రస్తుతం గుంటూరు జిల్లా జైలులో ఉన్న విషయం విదితమే.



కేంద్ర ఉక్కు మంత్రి హెచ్.డి. కుమారస్వామిని విశాఖ ఎంపీ శ్రీభరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణపై మంత్రితో మాట్లాడారు. అలాగే ఉద్యోగుల వేతనాల సమస్య ను మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. రెండు నెలల వేతనాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. తొందరలోనే స్టీల్ ప్లాంట్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఎంపీ భరత్ మీడియాకు వెల్లడించారు.

# రాఘవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత!



**కడప,మహానాడు:** వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కడప కోర్టు కొట్టివేసింది. సోషల్ మీడియాలో అసభ్య పోస్టుల వ్యవహారంలో ఇప్పటికే అరెస్టయిన వర్రా రవీందర్‌రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం మేరకు రాఘవరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. షర్మిల, సునీత, విజయమ్మపై .. వర్రాతో అసభ్యకరమైన పోస్టులు పెట్టించారని రాఘవరెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. గత 16 రోజులుగా రాఘవరెడ్డి పరారీలో ఉన్నారు.

# 'భోజనం' ధరలు పెంచిన కేంద్రం

◆ ఉత్తర్వులు జారీ

**అమరావతి:** పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పథకం ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన ధరలు డిసెంబరు ఒకటి నుంచి అమల్లోకి వస్తాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం రూ.5.45 చొప్పున ఇస్తుండగా.. దీన్ని రూ.6.19కు పెంచింది. ప్రాథమికోన్నత బడుల్లో చదివే ఒక్కొక్కరికి ఇప్పుడు రూ.8.17 ఇస్తుండగా.. దీన్ని రూ.9.29 చొప్పున చెల్లించనుంది. ఇందులో కేంద్రం 60%, రాష్ట్రం 40% భరించాల్సి ఉంటుంది.

# లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి పంపిణీ

**సత్తెనపల్లి, మహానాడు:**

సత్తెనపల్లి నియోజకవర్గంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ పంపిణీ చేశారు. రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దుసరా వెంకట కోటేశ్వరరావు కి రూ. 59692, రాజుపాలెం మండలం కుబాద్ పురం గ్రామానికి చెందిన చింతగుంట్ల శ్రీను కి 85440, నెమలిపూరి గ్రామానికి చెందిన దీపంగి నారాయణకి 49258, సత్తెనపల్లి రూరల్ మండలం ఫణిదం గ్రామానికి చెందిన



మన్నెకంటి వంశీకృష్ణకి 1,05,343 , ముప్పాళ్ల మండలానికి చెందిన బద్దిగం రామ తులసమ్మకి 1,08,600, కంభంపాటి వినీత్ కుమార్‌కి 2,52,304, బద్దిగం నాగమల్లేశ్వరి కి 1,08,600 రూపాయల చెక్కులను అందేశారు.



**అమరావతి:** మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా వైయస్ జగన్ నివాసంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయ ఇంఛార్జ్, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్, మాజీ మంత్రులు జోగి రమేష్, విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అంకంరెడ్డి నారాయణమూర్తి.

# రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్, సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

◆ దరఖాస్తులు పంపేందుకు చివరి తేదీ వచ్చే నెల11

**అమరావతి, మహానాడు:**

కర్నూల్ లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు చైర్ పర్సన్, ఒక సభ్యుడు(జుడీషియల్), మరో సభ్యుడు(నాన్ జుడీషియల్) నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి (పొలిటికల్) ఎస్.సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిషన్ చట్టం 1993లోని సెక్షన్ 21లోని సబ్ సెక్షన్ 2 ప్రకారం కమిషన్ చైర్ పర్సన్ గా దరఖాస్తు చేయు వారు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా లేదా న్యాయమూర్తిగా పని చేసి ఉండాలని తెలిపారు. అలాగే మానవ హక్కుల కమిషన్ సభ్యులు(జుడీషియల్)గా దరఖాస్తు చేసే వారు హైకోర్టు న్యాయమూర్తిగా లేదా రాష్ట్రంలో జిల్లా న్యాయమూర్తిగా కనీసం ఏడేళ్ళ అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు.

నాన్ జుడీషియల్ సభ్యుడు నియామకానికి మానవ హక్కులకు సంబంధించిన విషయాల్లో పరిజ్ఞానం లేదా ఆచరణాత్మక అనుభవం కలిగి ఉండాల్సి ఉంటుందన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993లోని సెక్షన్ 24 ప్రకారం రాష్ట్ర కమిషన్ చైర్‌పర్సన్, సభ్యుల పదవీకాలం మూడేళ్ళు లేదా 70 ఏళ్ళ వయస్సు వచ్చే వరకు ఏది ముందుగా అయితే అంత వరకూ ఆ పదవిలో కొనసాగేందుకు అర్హులు అన్నారు. పదవిని నిలిపివేసి నప్పుడు, చైర్‌పర్సన్ లేదా సభ్యుడు రాష్ట్ర ప్రభుత్వం లేదా భారత ప్రభుత్వం తదుపరి ఉద్యోగానికి అనర్హులన్నారు.




చైర్‌పర్సన్, సభ్యులకు జీత భత్యాలు ఉంటాయని, ఎప్పటికప్పుడు సవరించిన హైకోర్టు న్యాయమూర్తుల(సేవా నిబంధనలు) చట్టం, 1954 ప్రకారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జీతం, అలవెన్సులకు సమానమైన జీతం, అలవెన్సులు చైర్‌పర్సన్ చెల్లింపు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు కూడా ప్రస్తుత ఈ నోటిఫికేషన్ కింద మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల వ్యక్తులు వారి పుట్టిన తేదీ, అర్హతలు, పరిజ్ఞానం, మానవ హక్కుల విషయాలలో ఆచరణాత్మక అనుభవం మొదలైన వివరాలను తెల్ల కాగితంపై తెలియజేస్తూ వారి దరఖాస్తులను ప్రభుత్వ కార్యదర్శి (రాజకీయ) (ఎఫ్‌ఏసీ), సాధారణ పరిపాలన (ఎస్.సి.2) విభాగం, 1వ బ్లాక్, A.P. సెక్రటేరియట్, వెలగపూడి, అమరావతి -522238 అనే చిరునామాకు 2024 డిసెంబర్ 11వ తేదీలోపు అందేలా పంపించాలని సురేష్ కుమార్ సూచించారు.

# కూటమి సర్కారుతోనే రైతుకు భరోసా

◆ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**గుడ్లవల్లేరు, మహానాడు:** కూటమి సర్కారు పాలనలోనే రైతన్నకు భరోసా ఉంటుందని, రైతు కష్టాలను కూటమి ప్రభుత్వం తనవిగా భావిస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మనోహర్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడారు. గత ప్రభుత్వంలో స్థానికంగా ఉన్న పౌరసరఫరాల మంత్రి.. తామెన్ని కష్టాల్లో ఉన్న కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు.. తమ పంటల వద్దకే వచ్చి భరోసా కల్పిస్తున్న మనోహర్‌కు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ ఏమన్నారంటే... రైతే రాజు అనే విధంగా.. గత ప్రభుత్వ అడ్డగోలు నిబంధనలు తొలగించి... రైతుకు నచ్చిన మిల్లులో ధాన్యం విక్రయించేలా చర్యలు తీసుకున్నాం.

గతంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలు పునరావృత్తం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. రైతుల ద్వారా వాస్తవాలు తెలుసుకొని.. పరిస్థితుల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నాం. రైతులకు మేలు చేసేలా గతంలో ఎన్నడు లేని విధంగా నూతన సంస్కరణలు తీసుకువచ్చాం. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతు ఖాతాలో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నాం. గతంలో ఎన్నడూ లేనివిధంగా 17 శాతం ఉన్న... తేమ శాతాన్ని 24 శాతానికి పెంచాం. వాతావరణ మార్పుల వల్ల రైతుల ఆందోళన దృష్టిలో ఉంచుకొని వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకున్నాం. అందుబాటులో ఉన్న ప్రతి వాహనాన్ని రైతుల ధాన్యం రవాణాకు ఏర్పాటు చేశాం. ఎన్నుకున్న ప్రజల ఆశలకు అనుగుణంగా.. తామంతా బాధ్యతగా పనిచేస్తున్నాం. రైతాంగానికి కూటమి ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుంది.

ఎమ్మెల్యే వెనిగండ్ల రాముఏమన్నారంటే... గత ప్రభుత్వంలో



ఉన్న ఇబ్బందులు తొలగి.. రైతులు స్వేచ్ఛగా ధాన్యం విక్రయిస్తున్నారు. గుడివాడ నియోజకవర్గ రైతాంగ ఇబ్బందులు తెలియజేసిన వెంటనే.. ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకున్న మంత్రి మనోహర్‌కు ధన్యవాదాలు. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా మంత్రి రావడంతో రైతుల్లో భరోసా కలిగింది. వాతావరణ మార్పులతో.. రైతుల్లో ఏర్పడిన ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని..మూడు రోజులుగా కలెక్టర్, అధికారు లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నాం. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులందరం.. ప్రజలకు..జవాబుదారులుగా ఉంటూ పనిచేస్తున్నాం.

రైతు సంఘ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గుడివాడ జనసేన పార్టీ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, గుడ్లవల్లేరు మండలం అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్.పద్మావతి, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి వి.పార్వతి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ సృజన, స్థానిక నాయకులు, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# పర్యాటక కేంద్రంగా నిడదవోలు!

◆ టెంపుల్, ఎకో, కెనాల్ టూరిజం అభివృద్ధికి కంకణం

◆ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

**అమరావతి, మహానాడు:**

అందమైన నిడదవోలుకు పర్యాటక సొగసును అద్ది అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది తనదైన ముద్ర వేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రణాళికలు రచిస్తున్నారు. ఒక వైపు రాష్ట్రాన్ని పర్యాటకుల గమ్యస్థానంగా మారుస్తూ మరోవైపు తనను ఎమ్మెల్యేగా గెలిపించి, మంత్రిని చేసిన నిడదవోలు నియోజకవర్గ ప్రజల కోసం జీవితాంతం గుర్తుండేలా అభివృద్ధికి ప్రత్యేక సన్నాహాలు చేపట్టారు. నూతన పర్యాటక పాలసీ పురుడు పోసుకున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల నిధుల సహకారంతో ప్రముఖ మహిమాన్విత అధ్యాత్మిక క్షేత్రం శ్రీ కోట సత్తెమ్మ దేవాలయం, స్థానికంగా ఉన్న గోదావరి కాలువ, చారిత్రాత్మక హేవలాక్ బ్రిడ్జి, కడియం నర్సరీ ప్రాంతాలను సర్క్యూట్ గా చేసి, నిడదవోలు కేంద్రంగా టెంపుల్, ఎకో, కెనాల్ టూరిజం అభివృద్ధి చేయాలని మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించారు.

విశిష్టమైన చారిత్రక నేపథ్యం కలిగి, అద్భుతమైన ప్రాకారాలు, ఆకట్టుకునే ముఖద్వారం, ఎత్తైన రాజగోపురంతో నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో అలరారుతున్న ప్రముఖ మహిమాన్విత ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ కోట సత్తమ్మ దేవాలయాన్ని టెంపుల్ టూరిజంలో భాగంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి కందుల దుర్గేష్ చర్యలు తీసుకుంటున్నారు. లక్షలాది మంది భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలిచి శంఖు చక్ర గధ అభయ హస్త యజ్ఞోపవీత ధారిణిగా ఏకశిలా స్వయం భూవిగ్రహంతో అలరారుతున్న త్రిశక్తి స్వరూపిణి కోట సత్తెమ్మ తల్లి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు.

అదే విధంగా విజ్జేశ్వరం మీదుగా గోదావరి నుండి వచ్చే ప్రధాన కాలువను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది అందమైన టూరిజం స్పాట్‌గా చేసేందుకు మంత్రి కందుల దుర్గేష్ నిర్ణయించారు. పచ్చని ప్రకృతి ఒడిలో ఉన్న కాలువను సర్క్యూట్‌లో భాగంగా అభివృద్ధి చేసి కాలువలో బోట్ షికార్ ఏర్పాటు చేయనున్నారు. తద్వారా ప్రజలు కాలువ ఒడ్డున ఆహ్లాదంగా గడిపేలా, సేదతీరేలా తీర్చిదిద్దనున్నారు.

ఇక వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన రాజమహేంద్రవరం హేవలాక్ బ్రిడ్జి అభివృద్ధి ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన నేపథ్యంలో దానిని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇంజినీరింగ్ అద్భుతాలకు నిదర్శనంగా నిలిచిన



హేవలాక్ బ్రిడ్జి ఆధునికీకరణ పనులు త్వరలోనే పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఫుడ్ కోర్టులతో పాటు ఇతర వినోద కేంద్రాలు ఏర్పాటు చేసి తద్వారా గోదావరి అందాలను చూసేందుకు, ఆస్వాదించేందుకు వచ్చే సందర్శకులకు విజ్ఞానం, వినోదం పంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

భారతదేశపు అతి పెద్ద నర్సరీలో ఒకటైన కడియం నర్సరీకి పర్యాటక కళ తెచ్చేందుకు మంత్రి కందుల దుర్గేష్ ప్రణాళికలు సిద్ధం చేశారు. అరుదైన మొక్కలు దొరికే ప్రదేశంగా, పూల తోటలకు ప్రసిద్ధిగాంచిన కడియం నర్సరీకి అందమైన ముఖద్వారం, అంతర్గత రోడ్లు, అదనపు హంగులు జోడించి భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర పర్యాటక మంత్రిగా కందుల దుర్గేష్‌కు అవకాశం రావడంతో తనను నాయకుడిగా ఎన్నుకున్న నిడదవోలు, రాజమహేంద్రవరం ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది చరిత్రలో నిలపాలని భావిస్తున్నారు. ఇందుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. మంత్రి దుర్గేష్ ప్రణాళికలకు రూపం వస్తే నిడదవోలు నిర్మాణకర్తగా కీర్తిగాంచుతారనడంలో అతిశయోక్తి లేదు.



ముండ్లమూరు మండలం చంద్రగిరిలో ఓ మిల్క్‌డైరీ పై ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. మిల్క్ డైరీలో నకిలీపాల పదార్థాలు తయారు చేస్తున్నట్టు వచ్చిన సమాచారంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. పాల పదార్థాల శాంపిల్స్ తీసుకున్నామని, వాటిని ల్యాబ్స్‌కు పంపిస్తున్నామని., ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.

# అనారోగ్య బాధిత కుటుంబాలకు టీడీపీ భరోసా!

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

**పెదకూరపాడు, మహానాడు:**

ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పెదకూరపాడు మండలానికి మంజూరైన చెక్కులను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పంపిణీ చేశారు. పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా 12 మంది బాధితులకు 14,02,069 రూపాయల విలువైన



చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనారోగ్యం బారిన పడిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయాన్ని అందిస్తోందన్నారు.

వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించడం ద్వారా ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భరోసా కల్పిస్తోందన్నారు. ప్రజలకు ప్రతి విషయంలో అండగా నిలిచే విధంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పెదకూరపాడు మండల కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలోని రఘురామ్ నగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి జరిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని, మాట్లాడారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి, బడుగు, బలహీన వర్గాలకు హక్కులు, మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన ఘనత జ్యోతిరావు పూలే కే దక్కుతుందన్నారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ అవుట్‌సోర్సింగ్ లస్కర్ల సమస్యలు తీర్చండి

◆ బీజేపీ వారధికి కార్మికులు విజ్ఞప్తి

**విజయవాడ, మహానాడు:** ఒక ఏజెన్సీ ద్వారా అవుట్ సోర్సింగ్ ద్వారా ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ లో 611 మంది లస్కర్లు గా పని చేస్తూ అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నామని అవుట్ సోర్సింగ్ లస్కర్లు సిక్కోలు సుబ్రహ్మణ్యం, సూర్య చంద్రం లు భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర




కార్యాలయం లో వారధి కార్యక్రమం లో ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్య నారాయణ రాజు కు వినతి పత్రం సమర్పించి, ఆదుకోమని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం బీజేపీ ఇక్కడి కేంద్ర కార్యాలయంలో వారధి పేరిట గ్రీవెన్స్ నిర్వహిస్తోంది. గురువారం పలువురి నుంచి వినతులు ఆ పార్టీ నేతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న విధానం లో రెండు నెలలు జీతాన్ని కోల్పోతున్నామని, అదేవిధంగా నెల కు పదివేల జీతం తో జీవనం సాగించడం అసాధ్యం అవుతోందని, అందువల్ల ఏజెన్సీ నుండి తప్పించి ఆంధ్రప్రదేశ్ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ లో విలీనం చేయడం, ఖాళీల ను బట్టి రెగ్యులర్ చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా వేటుకూరి సూర్య నారాయణ రాజు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని హామీ ఇచ్చారు. వారధి కార్యక్రమం లో సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 29, నవంబర్ 2024 ||




జార్ఖండ్ సీఎంగా నేడు ఇండియా కూటమి నేత హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం. ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రత్యేక అతిథిగా ఆహ్వానించిన జార్ఖండ్ ప్రభుత్వము. రాంచీ విమానాశ్రయంలో రాష్ట్ర సంప్రదాయం తో ఘనంగా స్వాగతం పలికిన అధికారులు.. ఇండియా కూటమి నేతలు. డిప్యూటీ సీఎంకు z క్యాటగిరీ భద్రత.. వాహన కన్వాయే ఏర్పాటు.. సాయత్రం ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ.



# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- నిర్లక్ష్య కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోండి
- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

**గుంటూరు, మహానాడు:** పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి గురువారం ఇంజనీరింగ్, ఎలక్ట్రిసిటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి మంజూరు అయిన పనులను అధికారులు ఎందుకు మొదలు పెట్టటం లేదని సూటిగా ప్రశ్నించారు. అధికారులు కాంట్రాక్టర్లు మొదలు పెట్టటం లేదని సమాధానం ఇవ్వగా పనులు మొదలు పెట్టని కాంట్రాక్టర్ల మీద చర్యలు తీసుకోకుండా మీరు ఎందుకు మెతక వైఖరి అవలంబిస్తున్నారు అంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు పనులు ఎందుకు ముందుకు కదలటం లేదని ప్రశ్నించారు. అదే విధంగా బ్రాడిపేటలో మిగిలిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ప్రతి వీధి దీపం వెలగాలని, విస్తరించిన ప్రాంతాల్లో కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేయాలన్నారు. నియోజక వర్గంలో మంచినీరు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, శివారు ప్రాంతాలకు నీటిని అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. చిన్న సమస్యలు కూడా పత్రికల్లో ప్రధాన శీర్షికన ప్రచురితం అవుతుంటే అధికారుల్లో ఎందుకు చలనం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా, ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే బాధ్యత అధికారులదే అని ఎమ్మెల్యే గల్లా మాధవి తేల్చి చెప్పారు.




మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్బంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి . పూలే చిత్రపటానికి నివాళులు అర్పించిన సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తదితరులు.



మహనీయుడు, రాష్ట్రపిత జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా, పార్టీ కార్యాలయంలో నివాళులు అర్పించిన గృహ నిర్మాణ మరియు సమాచార, పౌర సంబదాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి






# నలుగురికి సీఎంఆర్ఎఫ్ కింద చెక్కులు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు

**చంద్రగిరి, మహానాడు:**

అనారోగ్య పరిస్థితులతో ఆర్థికంగా సతమతమవుతున్న నలుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం అందించి తానున్నానని భరోసా కల్పించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోసారి మానవత్వం చాటుకున్నారు. గురువారం రాత్రి నారావారి పల్లె ముఖ్యమంత్రి స్వగృహం వద్ద ఆర్థిక సమస్యలతో ఆరోగ్య చికిత్సకు ఇబ్బంది పడుతున్న నలుగురికి సీఎం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులను పంపిణీ చేశారు. జె.కుసుమ కుమారి వారి కుమార్తె జట్టి మానస(13) వాయిల్పాడు మండలానికి చెందిన అంకుర హాస్పిటల్ లో ఊపిరితిత్తుల వ్యాధితో చికిత్స పొందుతున్న వీడియో ముఖ్యమంత్రి కి వారు పంపారు. చలించిపోయిన సీఎం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వారికి ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. చంద్రగిరి మండలం, చెందిన శేషాపురం వాసి పొదిలి శారద కుమారుడు హర్షవర్దన్ బాబు(19) కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో వారికి ఆర్థికంగా భరోసా కల్పిస్తూ సీఎం మూడు లక్షల చెక్కును సీఎంఆర్ఎఫ్ కింద అందజేశారు. ఆర్ నాగరాజ, తిరుపతి గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తి తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని తన తల్లి కిడ్నీ సమస్యతో బాధపడుతోందని ఆర్థిక సహాయం కోరిన నేపథ్యంలో వారికి రెండు లక్షల రూపాయల చెక్కును సీఎంఆర్ఎఫ్ కింద ముఖ్యమంత్రి అందజేశారు. అలాగే, టి.కృష్ణయ్య చిన్న రామాపురం చంద్రగిరి మండలం వాసి తన మెడ భాగంలో గడ్డలు ఉన్నాయని ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని చికిత్సకు ఆర్థిక సాయం అందించాలని కోరగా 1.5 లక్షల రూపాయల చెక్కును సీఎం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని ఉన్నారు.

# గ'లీజు'


మొదటి పేజీ తరువాయి..

రోజా పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు.. పలు హోటళ్లను టూరిజం శాఖ పేరిట లీజుకు తీసుకుని, వాటి నిర్వహణను బెంగళూరుకు చెందిన ఒక బడా వ్యాపారికి అనధికారికంగా అప్పగించడం వివాదమయింది. ఆ వ్యవహారంలో దాదాపు 5 కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలు లేకపోలేదు. విచిత్రంగా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా.. రోజా కట్టబెట్టిన కాంట్రాక్టరే, టూరిజం పేరుతో హోటల్ నడుపుతున్నారు.

ఒక కులానికి చెందిన చౌల్ట్రీ కూడా అనధికారికంగా హోటల్ నడుపుతుంటే, దానిని కూడా సబ్‌లీజుల పేరుతో లక్షలు గడిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక కొండపై ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నుంచి హోటళ్ల వరకూ అంతా టీటీడీ హెల్త్ డిపార్ట్‌మెంట్ అజమాయిషీలోనే ఉంటుంది. ఆ విభాగం లైసెన్సు ఇచ్చి, సర్టిఫై చేస్తేనే హోటళ్లను కొనసాగించాలి. కానీ ఆ నిబంధనలు కూడా కొండెక్కించేశారు. అసలు ఇప్పటిదాకా హెల్త్ డిపార్టుమెంట్, ఎన్ని హోటళ్లకు లైసెన్సు ఇచ్చింది? ఎన్ని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను తనిఖీ చేసింది? ఎన్నిటిని సీజ్ చేసిందనే లెక్కలే లేకపోవడం ఆశ్చర్యం. మరి వీటిని రద్దు చేసే ధైర్యం కొత్త పాలకవర్గానికి ఉందా? అన్న చర్చకు తెరలేచింది. ప్రధానంగా రోజా బెంగళూరు కాంట్రాక్టరుకు అనధికారికంగా ఇచ్చిన సబ్‌లీజును రద్దు చేస్తారా? కొనసాగిస్తారో చూడాలి. వైఎస్ హయాంలో వుడ్‌సైడ్ హోటల్‌కు ఇచ్చిన లీజును దుర్వినియోగం చేసి, సబ్‌లీజుకి ఇచ్చిన వైనంపై టీటీడీ బోర్డు కన్నెర్ర చేసి, ఆ లీజు రద్దు చేసింది. అంటే టీటీడీ ఇచ్చిన లీజులను, ఎప్పుడనా రద్దు చేసే అధికారం ఉంది. మరి 'మంచిప్రభుత్వం'లో.. కొండపై వైసీపీ హవాకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందా? రెడ్‌సిగ్నల్ వేస్తుందా చూడాలి.

# 'మత్తు' అరాచకాలను చిత్తు చేయనున్న 'ఈగల్'!

- ప్రజా ఆరోగ్యం, రక్షణ, సామాజిక బాధ్యతలో కీలకం కానున్న కొత్త వ్యవస్థ
- అమరావతి కేంద్ర కార్యాలయంలో మొత్తం 249 మందితో పక్కా నిఘా రక్షణ వ్యవస్థ
- హోం శాఖ ఉత్తర్వులు జారీ



**అమరావతి, మహానాడు:** ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్ మెంట్ (ఈఏజీఎల్ఈ:ఈగల్) ఏర్పాటు చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతిలో ఈగల్ హెడ్ క్వార్టర్స్, ప్రత్యేక నార్కోటిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే జిల్లాకు ఒక నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇక నుంచి ప్రజల ఆరోగ్యం, రక్షణ, సామాజిక బాధ్యతలో 'ఈగల్' కీలకంగా వ్యవహరించనున్నందని భావిస్తున్నారు. ఈ వ్యవస్థ డ్రగ్ సంబంధిత నేరాల నివారణ, విచారణ, పరిశోధనపై ప్రత్యేక దృష్టి సారించనుంది.

నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా డిప్యూటీ సూపరెంటెండెంట్ స్థాయి అధికారి ఉంటారు. డిప్యూటేషన్ లో అధికారులను నియమించుకోవాలని హోంశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. శిక్షణను సమర్ధవంతంగా పూర్తి చేసి ఈగల్ ఆమోదించాకే డిప్యూటేషన్ లో పని చేసే ఛాన్స్ ఉంటుందని అందులో పేర్కొంది. ఈగల్ హెడ్ ఆఫీస్, నార్కోటిక్ పోలీస్ స్టేషన్, జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సెల్‌లో పనిచేసే వారికి విధి నిర్వహణ కాలంలో 30 శాతం స్పెషల్ అలోవెన్స్ కూడా చెల్లించనున్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆధ్వర్యంలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి ప్రాంతాల్లో 5 స్పెషల్ కోర్టులు లేదా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటును డీజీపీ పర్యవేక్షించనున్నారు. ఒక్క అమరావతి హెడ్ ఆఫీస్ లోనే 249 మందితో పక్కా నిఘా రక్షణ వ్యవస్థ ఏర్పాటు కానుంది. ఒక్కో నార్కోటిక్ పోలీస్ స్టేషన్ లో 66 మంది సిబ్బంది డిప్యుటేషన్ లో విధులు నిర్వహిస్తారు. అలాగే, జిల్లాలవారీగా నార్కోటిక్స్ కంట్రోల్ సెల్స్ లో 144 మంది విధుల్లో ఉంటారు. మొత్తం 358 మంది అధికారులతో ఈగల్ వ్యవస్థ ఏర్పాటు కానుంది. ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా కలుపుకొని డ్రగ్స్ నియంత్రణ కోసం మొత్తం 459 మందితో కూడిన ఈగల్ వ్యవస్థ తయారు కానుంది.

డిప్యూటేషన్ పద్ధతిలో 341 మంది, రెగ్యులర్ పద్ధతిలో 17 మందికి విధులు అప్పగిస్తారు. అలాగే, రూ.8.59 కోట్ల ఖర్చుతో ఈగల్ నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు జరిపారు. పరిశోధన పర్యవేక్షణ,

లీగల్ వింగ్, డాక్యుమెంటేషన్ ట్రైనింగ్, అవార్నెస్ వింగ్, అడ్మినిస్ట్రేటివ్ అండ్ లాజిస్టిక్స్ వింగ్, టెక్నికల్ వింగ్, స్టేట్ టాస్క్ ఫోర్స్ ల వంటి 5 కీలక విభాగాల ఏర్పాటుకు మార్గదర్శకాలు రడీ చేశారు. 1972 టోల్ ఫ్రీ నంబర్ నిర్వహణ కోసం సెంట్రల్ కంట్రోల్ రూమ్ లో 12 మంది కాల్ టేకర్ల నియామకం, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ సీసీ టీవీల ద్వారా సెంట్రల్ డిపాజిటరీ ద్వారా నిరంతర నిఘా, నార్కోటిక్ ప్రధాన పోలీస్ స్టేషన్ లో 66మంది పోలీస్ అధికారుల బృందం సేవలు, ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున ఏపీ వ్యాప్తంగా 26 డిస్ట్రిక్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ (డీఎన్ సీసీ)ల ఏర్పాటుకు సర్కారు చర్యలు తీసుకోనుంది.

## ప్రపంచ ఆర్థిక నేరగాడివైన

# నీకు పరువెక్కడ ఉంది జగన్?

- నువ్వు పరువు నష్టం దావా వేస్తాననడం హాస్యాస్పదం
- పరువు గురించి మాట్లాడే నైతక హక్కు, అర్హత నీకు లేవు జగన్
- నీకు నిజంగా పరువు ఉంటే ఎఫ్.బి.ఐ మీద దావా వేసే దమ్ముందా?
- నువ్వు పరువునష్టం దావా వేయాలని మేం కోరుకుంటున్నాం... కోర్టులో నీ నిజస్వరూపం బయటపెడతాం
- ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవల్మపెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి



**అమరావతి,మహానాడు:**

అవినీతే ఆరోప్రాణంగా...అబద్దాలే జన్మ హక్కుగా భావించిన జగన్మోహన్‌రెడ్డి విద్యుత్ రంగాన్ని తన లంచాల దాహంతో ఐదేళ్ల పాటు సర్వనాశనం చేశాడు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో జగన్మోహన్‌రెడ్డిని వివిధ దర్యాప్తు సంస్థలు అవినీతిపరుడు అని తేల్చినా జగన్మోహన్‌రెడ్డి ఇంకా అబద్దాలు చెప్పడం దారుణం.

రాష్ట్ర విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన నువ్వు నన్ను సన్మానించండి అని కోరడం ఏంటి జగన్మోహన్‌రెడ్డి? సోలార్ విద్యుత్ ధరలు రోజు రోజుకూ దిగజారిపోతుంటే నువ్వుమాత్రం యూనిట్ విద్యుత్ ధర రూ.2.49కు ఎందుకు ఒప్పందం కుదుర్చుకున్నావు? సెకీ అనేది ఇతర రాష్ట్రాలకు ఎందుకు లేఖ రాయలేదు? ఎందుకు ఏపీ ప్రభుత్వానికే లేఖ రాసిందో చెప్పగలవా జగన్?

రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపిన నువ్వు నిర్లజ్జగా సంవత్సరానికి రూ.44వేల కోట్లు ఆదా చేసే ప్రయత్నం చేశామని చెప్పడం నీ దగాకోరు బుద్ధికి నిదర్శనం కాదా? కేవలం రూ.2కే యూనిట్ విద్యుత్ వచ్చే అవకాశాలు ఉన్న పీపీఏలను రద్దు చేసి సెకీ చాటున వేరొక విద్యుత్ ఉత్పత్తి కంపెనీతో ఎందుకు ఒప్పందం చేసుకున్నావు? దాని వెనుక ఉన్న ఆర్థిక నేరాల రహస్యాన్ని ప్రజలకు ఎందుకు చెప్పలేదు జగన్?

ఏపీ ప్రభుత్వం ఇతర విద్యుత్ కంపెనీతో ఒప్పందం చేసుకుందని సెకీ తన లేఖలో స్పష్టంగా చెప్పినా, ఈ ఒప్పందంలో కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఉన్నాయి....థర్డ్ పార్టీకి ఇందులో ఆస్కారం లేదని చెప్పడం ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేయడం కాదా జగన్మోహన్‌రెడ్డి? నువ్వు సెకీతో ఒప్పందం చేసుకుని ఉంటే ఎఫ్.బి.ఐ నీ పేరును తన ఛార్జిషీట్ లో ఎందుకు దాఖలు చేశారు? సౌరవిద్యుత్ కొనుగోలు వ్యవహారంలో నీపై ఆరోపణలు వస్తే వివరణ ఇవ్వడానికి 3 రోజుల సమయం పట్టిందా? అయినా నేడు ప్రెస్ మీట్ లో చెప్పినవన్నీ అబద్దాలే.

నీ అవినీతి దాహానికి ప్రజలపై దాదాపు రూ.2లక్షల కోట్ల భారం మోపిన జగన్మోహన్‌రెడ్డి నేడు ఏమీ ఎరుగని నంగనాచిలా కబుర్లు చెప్పడం విడ్డూరంగా ఉంది. ప్రపంచ ఆర్థిక నేరస్తుడివైన నువ్వు పరువు నష్టం గురించి, పరువు గురించి మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారు జగన్మోహన్‌రెడ్డి. నీ అవినీతి బాగోతాన్ని ప్రజలకు చెప్పిన మీడియా సంస్థలపై నీ బెదిరింపులు సిగ్గుచేటు.

పరువు అనే పదం గురించి మాట్లాడే నైతిక హక్కు, అర్హత రెండూ నీకు లేవు అనే విషయాన్ని నువ్వు తెలుసుకోవాలి జగన్. నీకు నిజంగా పరువు ఉంది అనుకుంటే నిన్ను ప్రపంచ ఆర్థిక నేరగాడివని తేల్చిన అమెరికా సంస్థ ఎఫ్.బి.ఐ మీద పరువునష్టం దావా వేసే దమ్ముందా? నువ్వు పరువునష్టం దావా వేయాలనుకోవడాన్ని మేం స్వాగతిస్తున్నాం...అలాగైనా నీ నిజ స్వరూపం బయటపడుతుంది. నువ్వు త్వరగా ప్రెస్ మీట్ పెట్టి పరువునష్టం దావా వేస్తున్నానని చెప్పాలని కోరుకుంటున్నాం. నువ్వు నిజాయితీపరుడివి అయితే, నీకు నిజంగా దమ్ము ఉంటే పరువు నష్టం దావా వెయ్యి...నీ నిజస్వరూపాన్ని కోర్టులోనే మేం తేలుస్తాం.




బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ ఇంచార్జీగా నిబద్దతతో బాధ్యతలు నిర్వర్తించిన మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ మాదిరెడ్డి కి కేసీఆర్ ఘనంగా సత్కార కార్యక్రమం. 85 ఏండ్లు నిండిన శ్రీనివాసరెడ్డిని వారి దగ్గరే వుండాలని కోరుకున్న వారి పిల్లలు అమెరికాకు తీసుకుని వె ళుతున్నరు. ఈ నేపథ్యంలో తనతో కలిసి పనిచేసిన ఆత్మీయునికి ఆత్మీయ వీడ్కోలు ఏర్పాటు చేసిన కేసీఆర్ ఘనంగా సత్కరించిన సందర్భంగా ఆవిష్కృతమైంది.




జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 29, నవంబర్ 2024 ‖



## తుది దశలో 'హరి హర వీర మల్లు పార్ట్-1



ప్రాంతీయ భాషా చిత్రాలతోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అతికొద్ది మంది కథానాయకులలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఒకరు. ఆయన తన సినీ ప్రయాణంలో తొలిసారిగా 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' అనే పీరియాడికల్ యాక్షన్ సినిమాలో నటిస్తున్నారు. ప్రేక్షకులకు ప్రత్యేకమైన మరియు మరపురాని థియేట్రికల్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో నిర్మాతలు భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇటీవల చిత్ర బృందం, హాలీవుడ్ దిగ్గజ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశాన్ని చిత్రీకరించింది. పవన్ కళ్యాణ్‌తో పాటు 400 - 500 మంది పాల్గొన్న ఈ భారీ యుద్ధ సన్నివేశం కోసం యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ని ప్రత్యేకంగా నియమించారు. ఈ యుద్ధ సన్నివేశం అద్భుతంగా రావడంతో చిత్ర బృందం ఎంతో సంతోషంగా ఉంది. 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' చిత్రానికి సంబంధించి తాజాగా నిర్మాతలు కీలక విషయాన్ని పంచుకున్నారు. సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ వారాంతంలో విజయవాడలో ఆఖరి షెడ్యూల్ ప్రారంభం కానుంది.




## మీరిచ్చిన గ్రాండ్ వెల్‌కమ్ జీవితంలో మరిచిపోలేను: అల్లు అర్జున్

పుష్ప-2 ది రూల్ ఇప్పుడు భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రమిది. ఇండియాస్ బిగ్గెస్ట్ ఫిలింగా రూపొందిన ఈ చిత్రంలో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నట విశ్వరూపం చూడబోతున్నారు. బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభ, ఆయన క్లాస్ టేకింగ్‌తో ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ చిత్రంగా నిలవబోతుంది. ప్రపంచ స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో అత్యున్నతంగా హై బడ్జెట్‌తో నిర్మించారు. డిసెంబరు 5న చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. కాగా ఈ చిత్ర ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. అంతేకాదు ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి ఈవెంట్ సన్సేషన్ అవుతుంది. ఇటీవల బీహార్‌లోని పాట్నాలో జరిగిన పుష్ప-2 ట్రైలర్ లాంచ్ వేడుక ఇండియా మొత్తం హాట్‌టాపిక్‌గా నిలిచింది. చెన్నయ్‌లో జరిగిన వైల్డ్ ఫైర్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్‌గా నిలిచింది. ఐకాన్ స్టార్ ఎక్కడికి వెళితే అక్కడ ఆయన అభిమానులు గ్రాండ్ వెల్‌కమ్ పలుకుతున్నారు. తాజగా ఈ చిత్రం మరో గ్రాండ్ ఈవెంట్ కేరళలోని కొచ్చిలో ఎంతో ఘనంగా జరిగింది. కేరళలో మల్లు అర్జున్‌గా అత్యధిక అభిమానులు ఉన్న తెలుగు హీరోగా పేరున్న అల్లు అర్జున్‌కు అక్కడ అశేష జనాదరణ లభించింది. ఈ వేడుకలో ఐకాన్‌స్టార్ అభిమానులు ఎంతో సందడిగా కనిపించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ ' థ్యాంక్యూ కేరళ. మీ అడెంప్టెడ్ సన్ మల్లు అర్జున్‌కు మీరిచ్చిన ఈ గ్రాండ్ వెలకమ్ మరిచిపోలేనిది. గత 20 ఏండ్ల నుంచి మీరు నాపై ప్రేమ చూపిస్తున్నారు. ఈ సినిమా కెరీర్‌లో చాలా ప్రత్యేకం. ఈ చిత్రంలో మలయాళ గొప్ప నటుడు ఫహాద్ ఫాజిల్‌తో పనిచేయడం ఆనందంగా వుంది. ఈ సినిమాలో ఆయన నటన చూసి మీరంతా గర్వపడతారు. నా సినిమా కోసం మీరు మూడేళ్లు గా వెయిట్ చేస్తున్నందుకు కృతజ్ఞతలు. తప్పకుండా ఇక నుంచి తొందరగా సినిమాలు చేస్తాను. ఈ సినిమాలో రష్మిక తన నటనతో ఈ మెప్పిస్తుంది. రష్మికతో పనిచేయడం ఎంతో కంఫర్ట్‌గా అనిపించింది. రష్మిక ప్రజెన్స్‌తో సినిమా చాలా బెటర్ అయ్యింది. సుకుమార్ నా కెరీర్‌లో ఆర్యను ఇచ్చాడు. ఆర్య చిత్రంతోనే నా మార్కెట్ కేరళలో స్టార్ట్ అయ్యింది. దర్శకుడు సుకుమార్ వల్లే నేను మీకు దగ్గరయ్యాను. నా కెరీర్‌లో దేవి శ్రీప్రసాద్ ఎన్నో సూపర్‌హిట్ సాంగ్స్ ఇచ్చాడు.

## ఇంట్రస్టింగ్ టీజర్ శ్రీకాకుళం
## షెర్లాక్ హెూమ్స్-యదు వంశీ

వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న మూవీ 'శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్'. ఈ క్రైమ్ థ్రిల్లర్ కి రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా విడుదల చేయనున్నారు. ప్రమోషనల్ మెటీరియల్ ఇప్పటికే పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. మేకర్స్ టీజర్ లాంచ్ చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆత్మాహుతి దాడికి సంబంధించిన బ్రేకింగ్ న్యూస్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. ఒక పోలీసు అధికారి తనకి క్రిడెట్ వచ్చేలా ఓ క్రిమినల్ కేసును ఛేదించడానికి ఒక తెలివైన డిటెక్టివ్‌ని సాయం కోరుతూ ఆ పనిని శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్‌కి అప్పగిస్తాడు. టీజర్ మూవీ ప్రిమైజ్‌ని ఆసక్తికరంగా పరిచయం చేస్తోంది. వెన్నెల కిషోర్ లీడ్ రోల్ హ్యూమర్, ఇంటెల్జెంట్ బ్లెండ్ తో ఆకట్టుకుంది, కేసులను పరిష్కరించడంలో అతని యూనిక్ స్టయిల్ ని ప్రజెంట్ చేస్తోంది. వెన్నెల కిషోర్ తన పాత్రలో ఒదిగిపోయారు. టీజర్ లాంచ్ ఈవెంట్ లో దర్శకుడు యదు వంశీ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మూవీ టీమ్ అందరికీ కంగ్రాజులేషన్స్. వంశీ నందిపాటి మంచి సినిమాలని సపోర్ట్ చేస్తున్నారు. 2018, కమిటీ కుర్రాళ్ళు, రీసెంట్‌గా రిలీజ్ అయిన క.. ఇవన్నీ అద్భుతమైన విజయాలతో అలరించాయి. వంశీ గారిది నిజంగా గోల్డెన్ హ్యాండ్. మంచి కంటెంట్ ఎక్కడుంటే అక్కడికి వెళ్తున్నారు. ఆడియన్స్ కూడా కంటెంట్ ఉంటే చిన్న సినిమాని కూడా చాలా పెద్ద విజయాన్ని అందిస్తున్నారు. కమిటీ కుర్రాళు ్ళ, అయ్, క సినిమాలు అది ప్రూవ్ చేశాయి. 'శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్' టైటిల్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంది. చంటబ్బాయి తాలూకా అనే ట్యాగ్ పెట్టడం చాలా ఆసక్తికరంగా ఉంది. ఇలాంటి ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్స్ తెలుగులో చాలా తక్కువగా వస్తుంటాయి. మంచి డిస్ట్రిబ్యూటర్స్ ఉంటేనే ఇలాంటి మంచి సినిమాలు ప్రేక్షకులు ముందుకు వెళ్తాయి. వంశికి గుడ్ లక్. ఇలాంటి మంచి సినిమాలకు సపోర్ట్ చేసినందుకు థాంక్యూ వెరీ మచ్. రైటర్ మోహన్ చాలా మంది లెజెండరీస్ దగ్గర వర్క్ చేశారు. తప్పకుండా ఈ సినిమాతో ఆయనకు మంచి సక్సెస్ వస్తుంది. అనన్య చాలా మంచి మంచి సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. ఇది కూడా చాలా మంచి సినిమా అవుతుందని కోరుకుంటున్నాను. అందరికీ గుడ్ లక్' అన్నారు.



## కెసిఆర్ చిత్రానికి ఆస్కార్డు అవార్డు : రాకింగ్ రాకేష్

విభూది ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ పై గ్రీన్ ట్రి ప్రొడక్షన్స్ ద్వారా ఈనెల 22వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం కేశవ చంద్ర రమావత్. గరుడవేగ అంజి సినిమాటోగ్రఫీ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి చరణ్ అర్జున్ సంగీతం అందించారు. జబర్దస్త్ నటుడు రాకింగ్ రాకేష్, అనన్య కృష్ణన్ ప్రధాన పాత్రలుగా తాగుబోతు రమేష్, జోర్దార్ సుజాత, తనికెళ్ల భరణి ధనరాజ్, మైమ్ మధు తదితరులు కీలకపాత్రలో పోషించారు. అయితే ఈ చిత్రాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, సిద్దిపేట శాసనసభ్యులు శ్రీ హరీష్ రావు మరికొందరు పార్టీ కార్యకర్తలతో కలిసి చూడడం జరిగింది.



ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... "జబర్దస్త్ తో అందరికీ పరిచయమై వెండి తెరకు చేరిన రాకేష్ కి, అలాగే ఈ చిత్రంలో పనిచేసిన కళాకారులకు, సినిమా టీంకు నా హృదయపూర్వక అభినందనలు. ఈ చిత్రం చాలా అద్భుతంగా తీశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందుకి ఆ తర్వాతకి ప్రజల జీవితాలు ఎలా ఉన్నాయి అనేది చూపిస్తూ ఓ మంచి ప్రేమ కథతో తెలంగాణ గ్రామీణ వాతావరణానికి జోడించి ఈ చిత్రం తీయడం జరిగింది. సెంటిమెంటులతో మంచి ఎమోషన్ తో ఈ చిత్రాన్ని ఎక్కడ బోర్ కొట్టకుండా చిత్రం తెరకెక్కించారు. ఒక వైపు తెలంగాణ అభివృద్ధి చేసిన తీరును చూపిస్తూ గ్రామీణ వాతావరణం జీవితాలను వారి జీవనశైలి చాలా అద్భుతంగా చూపించారు. మరొకసారి ఈ చిత్రాన్ని అందరూ ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. రాకేష్ ముందు ముందు మరెన్నో సందేశాత్మక సినిమాలను తీయాలని కోరుకుంటున్నాను" అన్నారు.



## ప్రేక్షకుల మనసులో నిలిచిపోయే బచ్చల మల్లి

హీరో అల్లరి నరేష్ తన అప్ కమింగ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'లో కంప్లీట్ మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగదేవి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన బ్లాక్ బస్టర్స్ తర్వాత హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. టీజర్ మెయిన్ గా అల్లరి నరేష్ పాత్రపై ఫోకస్ చేస్తోంది. అల్లరి నరేష్ క్యారెక్టర్ ని కేర్ ఫ్రీ, మొండిపట్టుదల, మూర?త్వం వ్యక్తిగా టీజర్ హైలెట్ చేస్తోంది. అమృత అయ్యర్ క్యారెక్టర రిజెక్ట్ చేసినప్పటికీ ధైర్యంగా ఆమెతో ఫ్లర్ట్ చేస్తాడు. టీజర్ అతని రెబల్, నిర్లక్ష్య వైఖరి చూపిస్తోంది. అతను ఇతరుల అభిప్రాయా లని పట్టించుకోకుండా తన స్వంత నిబంధనలపై జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నాడు. నరేష్ పాత్ర పిల్లల నుంచి విరాళాల పెట్టెను తీసుకున్నప్పుడు, అతని రియల్ నేచర్ ని ప్రజెంట్ చేసే మూమెంట్ తో టీజర్ ఎండ్ అయ్యింది. నరేష్ మాస్ లుక్, అతని పెర్ఫార్మెన్స్ కంప్లీట్ చేస్తూ ఈ మాస్ క్యారెక్టర్‌కి డెప్త్ తీసుకొచ్చింది.

## రామ్‌కోసం టాప్ టెక్నీషియన్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ చాలా కథలు విన్న తర్వాత ఎట్టకేలకు మహేష్ బాబు పచ్చిగొల్ల దర్శకత్వంలో సినిమాను చేసేందుకు రెడీ అయ్యారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఇటీవలే జరిగాయి. పుష్ప 2 వంటి బిగ్గెస్ట్ మూవీని నిర్మించిన మైత్రి మూవీ మేకర్స్ వారి బ్యానర్‌లో రూపొందుతున్న సినిమా అవ్వడంతో రామ్22 సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే ఈ సినిమా ద్వారా మహేష్ బాబు సరికొత్త కథను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు అంటూ మేకర్స్ చెబుతూ సినిమాపై అంచనాలు పెంచుతూ వస్తున్నారు. ఊర మాస్ నరేష్ తాజాగా ఈ సినిమా కోసం ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మధు నీలకందన్ వర్క్ చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. సినిమా కాన్సెప్ట్ కి ఈయన సినిమాటోగ్రఫీ అయితేనే బాగుంటుంది అనే ఉద్దేశ్యంతో దర్శకుడు మహేష్ బాబుతో పాటు నిర్మాతలు భావించారని అందుకే ఆయన్ను రంగంలోకి దించేందుకు సిద్ధం అయ్యారని తెలుస్తోంది. ఆయన భారీ పారితోషికం డిమాండ్ చేసినా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. సూపర్ స్టార్ మోహన్‌లాల్ మూవీ మలైకోట్టై వాలిబన్‌కి సినిమాటోగ్రఫీ అందించడం ద్వారా విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న మధు నీలకందన్ తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా రామ్ 22 సినిమాకు వర్క్ చేస్తాడనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. ఈ సినిమాలో రామ్‌కి జోడీగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఇటీవల షూటింగ్ లాంచనంగా ప్రారంభం అయింది. రెగ్యులర్ షూటింగ్‌కి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ వారు ఈ సినిమాను చాలా స్పీడ్‌గా నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగానే వరుసగా డేట్లు తీసుకున్నారని తెలుస్తోంది. సమ్మర్ చివరి వరకు సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ఉద్దేశ్యంతో మహేష్ బాబు వర్క్ చేస్తున్నారని సైతం ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. మొత్తానికి రామ్, మహేష్ బాబు కాంబో మూవీ పై రోజు రోజుకు అంచనాలు పెంచుతూ వస్తున్నారు.




Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144